


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY


తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 12-05-2026 | సంపుటి - 27 | సంచిక -350 | రూ : 4 | పేజీలు: 8


## విద్యకు బడ్జెట్‌లో 15% నిధులు

- రానున్న కాలంలో కేటాయిస్తాం
- మా ప్రభుత్వ తొలి ప్రాధాన్యం విద్యే
- డ్రాపవుట్స్ తగ్గించేందుకు పాఠశాలల్లో ఇంటర్
- విద్యా వారోత్సవాల ప్రారంభం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, నారాయణగూడ: తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యం విద్యేనని.. రాష్ట్ర బడ్జెట్‌లో రానున్న కాలంలో 15 శాతం విద్యాశాఖకు కేటాయించనున్నామని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. సర్కారు బడి అంటే అమ్మ ఒడి అని.. పేదపిల్లలకు నాణ్యమైన విద్య

తరువాయి 2లో



## భారత్ ఎవరికీ లొంగదు

- పోఖ్రాన్ పరీక్షలే ఇందుకు ఉదాహరణ
- సోమనాథ్ ఆలయ పునరుద్ధరణను నెహ్రూ వ్యతిరేకించారు
- పటేల్ కృషి వల్లే పునర్నిర్మాణం సాధ్యమైంది
- అమృత మహోత్సవంలో ప్రధాని మోదీ ఉద్ఘాటన

సోమనాథ్ (గుజరాత్): ప్రపంచంలో ఎవరికీ భారత్‌ను లొంగదీసుకోవడం సాధ్యం కాదని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. పోఖ్రాన్ అణు పరీక్షల సమయంలో అంతర్జాతీయంగా మన దేశంపై ఎంతో ఒత్తిడి వచ్చిందని, అయినా అప్పటి అటల్ బిహారీ వాజ్‌పేయీ నేతృత్వంలోని భాజపా ప్రభుత్వం వెనక్కి తగ్గలేదని ఆయన గుర్తుచేశారు. గుజరాత్‌లోని పవిత్ర పుణ్యక్షేత్రమైన సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణం జరిగి 75 ఏళ్లు పూర్తవుతున్న

తరువాయి 2లో

## రండి.. పరిశ్రమలు పెట్టండి

- ఒక్కో పారిశ్రామికవేత్త ఏపీలో ఒక్కటైనా ఏర్పాటుచేయాలి
- సీఐఐ వార్షిక సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు
- 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని వెల్లడి




దిల్లీ: భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) తరఫున ఒక్కో పారిశ్రామికవేత్త కనీసం ఒక్కపరిశ్రమనైనా ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. గత 23 నెలల్లో ఆంధ్రప్రదేశ్‌కు తాము రూ.23లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించగలిగామని, దీని ద్వారా 23 లక్షల ఉద్యోగాలు సృష్టించగలుగుతామని తెలిపారు. పెట్టుబడుల ఆకర్షణలో ఇప్పుడు రెండోస్థానంలో ఉన్నామని.. తొలిస్థానంలో నిలవాలన్నదే తన

తరువాయి 2లో



## బండి భగీరథ్ కేసులో దర్యాప్తు ముమ్మరం

- డీసీపీ రితిరాజ్‌కు పర్యవేక్షణ బాధ్యతలు
- నేడు మరోమారు బాధితురాలి వాంగ్మూలం నమోదు

హైదరాబాద్: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు దర్యాప్తు ముమ్మరమైంది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పర్యవేక్షణాధికారిగా నియమితులైన కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ సోమవారం మధ్యాహ్నమే కేసు నమోదైన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సంఘటన పూర్వాపరాలను సమీక్షించారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు, ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైన వివరాల గురించి ఆరా తీశారు. భగీరథ్.. తన కుమార్తెను వేధిస్తున్నాడంటూ 17 ఏళ్ల బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్లో ఈ నెల 8న కేసు నమోదైన సంగతి తెలిసిందే. మరోవైపు ఆ బాలిక, ఆమె తల్లి తనను డబ్బు కోసం బెదిరిస్తున్నారంటూ భగీరథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 8వ తేదీనే కరీంనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

### > నేడు భరోసా కేంద్రానికి బాధితురాలు

కేసు నమోదు సమయంలోనే బాధితురాలైన బాలిక నుంచి పోలీసులు వాంగ్మూలం నమోదు చేశారు. దీన్ని పరిశీలించిన డీసీపీ రితిరాజ్ మంగళవారం మరోమారు బాలికను భరోసా కేంద్రానికి పిలిపించాలని ఆదేశించారు. తన సమక్షంలోనే విచారించి

తరువాయి 2లో

## నీట్ ప్రశ్నాపత్రం లీక్!

- రాజస్థాన్‌లో వెలుగులోకి
- దర్యాప్తు చేస్తున్న ఎస్ఓజీ
- ఇప్పుడే ఏమీ చెప్పలేమన్న ఎన్‌టీఏ


దిల్లీ: జాతీయ అర్హత పరీక్ష (నీట్ యూజీ 2026)కు సంబంధించి ప్రశ్నాపత్రం లీక్ అయినట్లు వస్తున్న వార్తలు కలకలం సృష్టిస్తున్నాయి. పరీక్షకు ముందు రాజస్థాన్‌లో కోచింగ్ సంస్థలు పంపిణీ చేసిన మెటీరియల్‌తో ప్రశ్నా పత్రంలోని 600 మార్కుల ప్రశ్నలు పోలి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. దీనిలో పలు రాష్ట్రాల నెట్‌వర్క్‌ల

తరువాయి 2లో




## మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా జూన్ 12న సామూహిక ప్రతిజ్ఞ

- విద్యార్థులతో హైదరాబాద్‌లో బహిరంగ సభ
- గవర్నర్ శివప్రతాప్ శుక్లాను ఆహ్వానించిన సీఎం రేవంత్‌రెడ్డి
- ఆ రోజే విద్యార్థులకు స్కూల్ కిట్ అందిస్తామని వెల్లడి



2లో



## రాష్ట్రంపై జీ రామ్ జీ భారం ఏటా రూ.2 వేల కోట్లు

- ఇప్పటివరకు వేతనాల్లో 100%, సామగ్రిలో 75% కేంద్రం వాటా
- జులై నుంచి రెండింట్లోనూ 60 శాతమే చెల్లింపు
- జులై 1 నుంచి అమలుకు కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్

2లో

# విద్యకు బడ్జెట్‌లో 15% నిధులు

హైదరాబాద్, నారాయణగూడ: తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యం విద్యేనని.. రాష్ట్ర బడ్జెట్‌లో రానున్న కాలంలో 15 శాతం విద్యాశాఖకు కేటాయించనున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. సర్కారు బడి అంటే అమ్మ ఒడి అని.. పేదపిల్లలకు నాణ్యమైన విద్య అందించే దేవాలయమన్నారు. పేదింటి బాలలకు విద్యాబుద్ధులు చెప్పడంతోపాటు తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములను చేద్దామని పిలుపునిచ్చారు. ప్రజా పాలనప్రగతి ప్రణాళికలో భాగంగా హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో విద్యావారోత్సవాలను సోమవారం ప్రారంభించారు. క్యూర్ పరిధిలో రూ.1,761 కోట్లతో నిర్మించనున్న పాఠశాలలకు ఇక్కడి నుంచే సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ''మా చిన్నప్పుడు ప్రభుత్వాలు నాణ్యమైన విద్యను అందించకపోతే.. నేను ముఖ్యమంత్రిగా మీ ముందు నిలబడకపోయే వాడిని.. ఈ వేదికపై ఉన్నవారిలో 90శాతం మంది ఇక్కడుండేవారు కాదు.. ప్రస్తుతం వేర్వేరు కారణాలతో సర్కారు బడుల్లో పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఇష్టపడడం లేదు. అందుకే విద్యార్థులకు చదువు చెప్పడమంటే బరువుగా కాదు.. బాధ్యతగా భావిద్దాం. టీచర్ అంటే ఉద్యోగం కాకుండా భావోద్వేగంతో వారితో మాట్లాడదాం. రెండేళ్ల నుంచి చేపట్టిన సంస్కరణల కారణంగా విద్యలో మార్పులొస్తున్నాయి.

* **విద్యార్థుల్లో నైపుణ్యాలు గుర్తించే టీచర్లను సత్కరిద్దాం..**

ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి వరకూ ఎలాగోలా చదువుకుంటున్నా.. ఇంటర్‌లో డ్రాపవుట్స్ పెరుగుతున్నాయి. వీటిని తగ్గించేందుకు కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ఎల్‌కేజీ నుంచి ఇంటర్ వరకూ బోధించే ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేయనున్నాం. వాటిలో చదివే విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందించనున్నాం. అల్పాహారంతో పాటు పిల్లలకు రాగి జావ, పాలు కూడా ఇవ్వనున్నాం. సర్కారు బడులు, యంగ్ ఇండియా స్కూళ్లలో చదువుకున్నవారు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లుగా మారి సర్కారు బడుల్లో చదువుకున్నానని గుండె ధైర్యంతో చెప్పాలి. తెలంగాణ ముఖ్యమంత్రిని అవుతానన్న ఆత్మవిశ్వాసం వ్యక్తం చేయాలి. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే వివక్షకు గురవుతున్నామన్న భావనతో ఉస్మానియా, కాకతీయ విద్యార్థులు తెలంగాణ తొలిదశ, మలిదశ ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించారు. వారి ఉద్యమాలతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైంది. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక అన్ని వర్సిటీలను పునరుద్ధరిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో 11 వేలకుపైగా టీచర్లను నియమించాం. ప్రస్తుతం రాష్ట్రంలో 1.05 లక్షల మంది ఉపాధ్యాయులున్నారు. జాతీయ విద్యావిధానం ప్రకారం 30మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉండాలి. మన రాష్ట్రంలో 17 మందికి ఒక ఉపాధ్యాయుడున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన టీచర్లున్నా ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్నారు.. అక్కడ ఏమంత గొప్పగా ఉంది? మన లోపాలేంటి? అని ప్రశ్నించుకుని ముందుకు వెళ్దాం. విద్యార్థుల్లో నైపుణ్యాలను గుర్తించే టీచర్లను అభినందిద్దాం. జూన్ 2, డిసెంబరు 9న వారిని సత్కరిద్దాం'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ చాటిన పది, ఇంటర్ విద్యార్థులతోపాటు హెడ్‌మాస్టర్లు, పాలిటెక్నిక్ అధ్యాపకులకు సీఎం రేవంత్‌రెడ్డి నగదు బహుమతులు అందజేశారు. మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్‌యాదవ్, వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాం, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ సలహాదారులు, విద్యాశాఖ అధికారులు, వివిధ విశ్వవిద్యాలయాల వీసీలు తదితరులు పాల్గొన్నారు.



# మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా జూన్ 12న సామూహిక ప్రతిజ్ఞ

హైదరాబాద్: రాష్ట్రంలో జూన్ 12వ తేదీన పాఠశాలల ప్రారంభం సందర్భంగా... పొగాకు, మద్యం, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో సామూహిక ప్రతిజ్ఞ చేయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లాకు తెలిపారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించాలని రేవంత్‌రెడ్డికి గతంలో గవర్నర్ సూచించారు. ఆయన సూచనను గౌరవిస్తూ విద్యార్థులతో హైదరాబాద్‌లో భారీ సభ ఏర్పాటు చేసి యాంటీ డ్రగ్స్ ప్రతిజ్ఞ చేయించాలని సీఎం నిర్ణయించారు. ఈక్రమంలో ఆయన సోమవారం రాత్రి లోక్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌ను కలిశారు. సామూహిక ప్రతిజ్ఞతోపాటు పాఠశాలల ప్రారంభం రోజే విద్యార్థులకు స్కూల్ కిట్లు అందజేస్తామని, ఆ కార్యక్రమానికి హాజరు కావాలని గవర్నర్‌ను ఆహ్వానించారు. కిట్లలో ఏకరూప దుస్తులు, పాఠ్య, నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగ్, క్రీడా దుస్తులు, విద్యార్థులకు అవసరమైన ఇతర సామగ్రి ఉంటాయని వివరించారు.

**ప్రవేశాల సమయంలో హామీపత్రం**

డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని, వాటిని వినియోగించడంగానీ, విక్రయించడంగానీ చేయబోమని ప్రవేశాల సందర్భంగా ప్రతి విద్యార్థి, వారి తల్లిదండ్రుల సంతకాలతో హామీపత్రం తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. తాజాగా ఇంటర్‌మీడియట్ షెడ్యూల్ జారీ చేయగా... అందులో యాంటీ డ్రగ్ అఫిడవిట్ తప్పనిసరని నిబంధన పెట్టారు. దాన్ని అన్ని కళాశాలలు, వర్సిటీల్లోనూ అమలు చేయనున్నారు.

# బండి భగీరథ్ కేసులో దర్యాప్తు ముమ్మరం

హైదరాబాద్: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు దర్యాప్తు ముమ్మరమైంది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పర్యవేక్షణాధికారిగా నియమితులైన కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ సోమవారం మధ్యాహ్నమే కేసు నమోదైన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సంఘటన పూర్వాపరాలను సమీక్షించారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు, ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైన వివరాల గురించి ఆరా తీశారు. భగీరథ్.. తన కుమార్తెను వేధిస్తున్నాడంటూ 17 ఏళ్ల బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్లో ఈ నెల 8న కేసు నమోదైన సంగతి తెలిసిందే. మరోవైపు ఆ బాలిక, ఆమె తల్లి తనను డబ్బు కోసం బెదిరిస్తున్నారంటూ భగీరథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 8వ తేదీనే కరీంనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

**నేడు భరోసా కేంద్రానికి బాధితురాలు**

కేసు నమోదు సమయంలోనే బాధితురాలైన బాలిక నుంచి పోలీసులు వాంగ్మూలం నమోదు చేశారు. దీన్ని పరిశీలించిన డీసీపీ రితిరాజ్ మంగళవారం మరోమారు బాలికను భరోసా కేంద్రానికి పిలిపించాలని ఆదేశించారు. తన సమక్షంలోనే విచారించి మరోమారు వాంగ్మూలం నమోదు చేయనున్నారు. ఈ వాంగ్మూలాన్ని బట్టి అవసరమైతే ఇప్పటికే నమోదైన సెక్షన్లలో మార్పులు చేయడంగానీ, అదనపు సెక్షన్లు జోడించడంగానీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం బాధితురాలు ఇవ్వబోయే వాంగ్మూలానికి ప్రాధాన్యం ఏర్పడింది. పోలీసుల సమాచారం ప్రకారం.. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదును కూడా డీసీపీ రితిరాజ్ పరిశీలించారు. మైనర్ అయిన తన కుమార్తెను బండి భగీరథ్.. లైంగికంగా వేధించడం, అసభ్యంగా ప్రవర్తించడం, బెదిరించడం వంటి నేరాలకు పాల్పడ్డాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

**ముఖ్యమంత్రి సమీక్ష**

రాజకీయంగా దుమారం రేపిన ఈ కేసు దర్యాప్తు పురోగతిని సమీక్షించేందుకు స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రంగంలోకి దిగారు. సోమవారం ఉదయం డీజీపీ ఆనంద్‌ను పిలిపించి పూర్వాపరాలను సమీక్షించారు. కేసు తీవ్రత దృష్ట్యా పర్యవేక్షణ బాధ్యతలను మహిళా అధికారికి అప్పగించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దర్యాప్తులో ఎక్కడా అలసత్వం కూడదని, పారదర్శకంగా జరపాలని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కేసు దర్యాప్తు పర్యవేక్షణ బాధ్యతలను డీసీపీ రితిరాజ్‌కు అప్పగిస్తూ... సైబరాబాద్ పోలీసు కమిషనర్ రమేశ్ ఉత్తర్వులు జారీచేశారు. దర్యాప్తు పురోగతిని రోజువారీ ప్రాతిపదికన తనకు సమర్పించాలని ఆదేశాల్లో సూచించారు. తనతో అసభ్యంగా ప్రవర్తించాడని బాలిక చెబుతున్న ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఫుటేజీతోపాటు ఆ సమయంలో వారితో ఉన్న ఇతరుల వివరాలు సేకరిస్తున్నారు.

* **ప్రణాళిక సిద్ధం చేశాం..: రితిరాజ్, డీసీపీ, కూకట్‌పల్లి**

కేసు పురోగతిని తెలుసుకోవడానికి ఏసీపీ, ఇన్‌స్పెక్టర్‌తో సమీక్షించా. ఈ కేసును సమగ్రంగా దర్యాప్తు చేయడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో సమావేశంలో ఒక ప్రణాళిక సిద్ధం చేశాం. బాధితురాలి వాంగ్మూలం ఇప్పటికే రికార్డు చేశాం. మరిన్ని వివరాల కోసం మరోసారి ఆమె వాంగ్మూలం తీసుకుంటాం. గత రెండ్రోజుల్లో పోలీసులు కొన్ని ఆధారాలు సేకరించారు. ఈ కేసులో నిందితుడి గురించి సమాచారం సేకరిస్తున్నాం.

# నీట్ ప్రశ్నాపత్రం లీక్!

దిల్లీ: జాతీయ అర్హత పరీక్ష (నీట్ యూజీ 2026)కు సంబంధించి ప్రశ్నాపత్రం లీక్ అయినట్లు వస్తున్న వార్తలు కలకలం సృష్టిస్తున్నాయి. పరీక్షకు ముందు రాజస్థాన్‌లో కోచింగ్ సంస్థలు పంపిణీ చేసిన మెటీరియల్‌తో ప్రశ్నా పత్రంలోని 600 మార్కుల ప్రశ్నలు పోలి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. దీనిలో పలు రాష్ట్రాల నెట్‌వర్క్‌ల హస్తం ఉందంటూ వస్తున్న ఆరోపణలపై రాజస్థాన్ స్పెషల్ ఆపరేషన్ గ్రూపు (ఎస్ఓజీ) దర్యాప్తు చేపట్టింది. లీకేజీ వార్తలను నీట్ నిర్వహించిన జాతీయ పరీక్ష సంస్థ (ఎన్‌టీఏ) కూడా కొట్టిపారేయకపోవటం గమనార్హం! ఈ నెల 3న జరిగిన పరీక్షలో కెమిస్ట్రీ విభాగంలో వచ్చిన సుమారు 120కి పైగా ప్రశ్నలతో ఉన్న ఓ ప్రాక్టీసు పేపరును గుర్తించినట్లు రాజస్థాన్ అదనపు డీజీపీ విశాల్ బన్సాల్, ఎస్ఓజీ అధికారులు వెల్లడించారు. ఈ మెటీరియల్ రాజస్థాన్‌లోని సికార్‌లో పరీక్షకు 42 గంటల ముందు వాట్సాప్‌లో అందుబాటులోకి వచ్చినట్లు నిర్ధారించారు. దీనిని విద్యార్థులకు రూ.20వేల నుంచి రూ.2 లక్షల వరకు విక్రయించారని, కొందరు అభ్యర్థుల నుంచి ముందుగానే రూ.30 వేలకు పైగా వసూలు చేశారని గుర్తించామన్నారు. ఈ ప్రశ్నలు యాదృచ్ఛికంగా ఒకే మాదిరిగా ఉన్నాయా? లేక ఎవరైనా పేపర్ లీక్ చేశారా? అనే దానిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. కొన్ని ప్రశ్నల్లోని జవాబుల క్రమం కూడా ఒకేలా ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆ ప్రాక్టీసు పేపరు కేరళలోని ఓ వైద్య కళాశాలలో చదువుతున్న ఎంబీబీఎస్ విద్యార్థికి చెందినదిగా దర్యాప్తులో వెల్లడైంది. ఆ వ్యక్తి ఈ నెల 1న సికార్‌లోని తన స్నేహితుడికి ఈ మెటీరియల్ ఇచ్చాడని.. ఆ తర్వాత అది పీజీ వసతిగృహాలు, కోచింగ్ నెట్‌వర్క్‌లు, కెరీర్ కౌన్సిలర్లు, పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు చేరిందని అధికారులు తెలిపారు. ఆ మెటీరియల్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీకి సంబంధించిన 300కు పైగా చేతిరాత ప్రశ్నలు ఉన్నాయని వెల్లడించారు.

# రాష్ట్రంపై జీ రామ్ జీ భారం ఏటా రూ.2 వేల కోట్లు

హైదరాబాద్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో జులై 1 నుంచి వికసిత్ భారత్‌గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, ఆజీవికా మిషన్‌గ్రామీణ్ (వీబీజీ రామ్ జీ) పథకం అమలుకు కేంద్ర ప్రభుత్వం తాజాగా నోటిఫికేషన్ ఇచ్చింది. దీని ప్రకారం రాష్ట్రంపై ఏటా రూ.2 వేల కోట్ల వరకు అదనపు భారం పడే అవకాశం ఉంది. ఉపాధి హామీ పథకంలో వేతనాలు, పరిపాలన వ్యయం మొత్తం కేంద్రమే భరించేది. సామగ్రి వాటాలో 75% ఇస్తే మిగిలిన 25% వాటా రాష్ట్రానిదిగా ఉండేది. జులై నుంచి వేతనాలు, సామగ్రి వాటాలో 60% వాటానే కేంద్రం భరించనుండటంతో రాష్ట్ర ప్రభుత్వంపై మిగిలిన భారంపడనుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నిధుల అవసరం తదితర అంశాలపై దృష్టి సారించింది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ సమగ్ర నివేదికను రూపొందిస్తోంది.

**భారం ఇలా..**

* రాష్ట్రంలో ఉపాధి హామీ కోసం ఏటా రూ.6,000 కోట్ల వరకు ఖర్చవుతోంది.
* ఇందులో వేతనాల రూపేణా వందశాతం కింద రూ.4 వేల కోట్లను, రూ.2 వేల కోట్ల సామగ్రి వాటా పనుల్లో 75% కింద రూ.1,500 కోట్లను కేంద్రం ఇస్తుండగా.. మిగిలిన రూ.500 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోంది.
* కొత్త ప్రతిపాదనల ప్రకారం.. కేంద్రం వేతనాలు, సామగ్రి వాటా 60% కింద రూ.3,600 కోట్లు భరిస్తే.. మిగిలిన రూ.2,400 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. అంటే రూ.2 వేల కోట్ల వరకు అదనపు భారం పడనుంది.
* ఈ ఆర్థిక సంవత్సరంలో 3 నెలలు పోతే మిగిలిన 9 నెలలకు రూ.4,500 కోట్లు ఉపాధి హామీకి వ్యయ అంచనా కాగా ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.2,700 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.1800 కోట్లు భరించాలి.
* రాష్ట్ర ప్రభుత్వం 202627 ఆర్థిక సంవత్సరానికి గాను తన బడ్జెట్‌లో రూ.228 కోట్ల కేటాయింపులు చేసింది.
* ఇందులో ఏప్రిల్ నుంచి మే వరకు రూ.28 కోట్లను సామగ్రి వాటా కింద వెచ్చించనుంది. ఇంకా రూ.200 కోట్లు మిగిలితే.. దానికి మరో రూ.1,600 కోట్లను జత చేయాల్సి ఉంటుంది.

**చట్టం వర్తించాలంటే..**

కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. రాష్ట్ర ప్రభుత్వం వీబీజీ రామ్ జీ పథకాన్ని అమలు చేస్తామని శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలి. దీనికి అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు జరిపితేనే కేంద్రం దీనిని రాష్ట్రంలో అమలు చేసే వీలుంది. జూన్ వరకు శాసనసభ సమావేశాలు లేనందున పథకం అమలుకు ఆర్డినెన్స్ జారీ చేసి కేంద్రానికి సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని అధికారవర్గాలు చెబుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం గత డిసెంబరులో ఉపాధి హామీ రద్దుతోపాటు ఆ తరువాత బడ్జెట్‌లో వీబీజీ రామ్ జీ పథకంపై స్పష్టతిచ్చింది. దీనిని రాష్ట్రప్రభుత్వం వ్యతిరేకిస్తూ ఇప్పటికే శాసనసభలో తీర్మానం చేయడంతోపాటు కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌కు విన్నవించింది.

# భారత్ ఎవరికీ లొంగదు

సోమనాథ్ (గుజరాత్): ప్రపంచంలో ఎవరికీ భారత్‌ను లొంగదీసుకోవడం సాధ్యం కాదని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. పోఖ్రాన్ అణు పరీక్షల సమయంలో అంతర్జాతీయంగా మన దేశంపై ఎంతో ఒత్తిడి వచ్చిందని, అయినా అప్పటి అటల్ బిహారీ వాజ్‌పేయీ నేతృత్వంలోని భాజపా ప్రభుత్వం వెనక్కి తగ్గలేదని ఆయన గుర్తుచేశారు. గుజరాత్‌లోని పవిత్ర పుణ్యక్షేత్రమైన సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణం జరిగి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న అమృత మహోత్సవంలో మోదీ సోమవారం పాల్గొన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. ''విదేశీ ఆక్రమణదారుల దాడుల్లో సోమనాథ్ ఆలయం ఎన్నోసార్లు ధ్వంసమైనా, మళ్లీ ప్రాణం పోసుకుంది. ఈ అమృత మహోత్సవం కేవలం గతానికి సంబంధించిన వేడుక కాదు. రాబోయే వెయ్యేళ్లపాటు భారతదేశానికి స్ఫూర్తినిచ్చే పండుగ. దేశం ముందుకు సాగాలంటే అభివృద్ధిని, మన మూలాలను సమాంతరంగా ముందుకు తీసుకెళ్లాలి. సోమనాథ్ ఆలయ పునరుద్ధరణను దేశ తొలి ప్రధాని నెహ్రూ వ్యతిరేకించారు. అయినా వల్లభ్‌భాయ్ పటేల్, మొదటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్‌లు పునర్నిర్మించారు. ఇప్పటికీ దేశంలో బుజ్జగింపు రాజకీయాలను కొందరు చేస్తున్నారు. ఆ శక్తులే రామమందిర నిర్మాణాన్ని కూడా వ్యతిరేకించాయి'' అని మోదీ అన్నారు. పోఖ్రాన్ అణు పరీక్షల గురించి మాట్లాడుతూ.. ''మే 11కి ఓ ప్రత్యేకత ఉంది. 1998లో ఇదే రోజున పోఖ్రాన్ పరీక్షలను భారత్ నిర్వహించింది. ప్రపంచమంతా విస్తుపోయింది. శక్తిమంతమైన దేశాలు కన్నెర్ర చేశాయి. ఆర్థిక ఆంక్షలు విధించాయి. వేరే దేశాలైతే ఈ ఒత్తిడికి లొంగిపోయేవి. కానీ వాజ్‌పేయీ నేతృత్వంలోని భాజపా ప్రభుత్వం లొంగకపోగా... రెండు రోజుల తర్వాత (1998 మే 13న) మరో రెండు అణుపరీక్షలు నిర్వహించి తమకు దేశమే ముఖ్యమని చాటి చెప్పింది'' అని వివరించారు. సోమనాథ్ ఆలయ పునరుద్ధరణ జరిగి 75 ఏళ్లు పూర్తయినందుకు గుర్తుగా ప్రధాని ఒక ప్రత్యేక పోస్టల్ స్టాంపును విడుదల చేశారు. అంతకుముందు సోమనాథ్ ఆలయంలోని శివలింగానికి ప్రధాని మోదీ వేద మంత్రోచ్చారణల మధ్య 'మహా పూజ' 'జలాభిషేకం' నిర్వహించారు. దేశంలోని వివిధ పుణ్యక్షేత్రాల నుంచి సేకరించిన పవిత్ర జలాలను ఓ క్రేన్ సహాయంతో ఆలయ శిఖరంపై జల్లారు. భారత వైమానిక దళానికి చెందిన 'సూర్యకిరణ్' విమానాలు ఎయిర్ షో నిర్వహించాయి. ఆలయ ప్రాంగణంపై హెలికాప్టర్లు పూల వర్షం కురిపించాయి.

# రండి.. పరిశ్రమలు పెట్టండి

దిల్లీ: భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) తరఫున ఒక్కో పారిశ్రామికవేత్త కనీసం ఒక్కపరిశ్రమనైనా ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటుచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. గత 23 నెలల్లో ఆంధ్రప్రదేశ్‌కు తాము రూ.23లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించగలిగామని, దీని ద్వారా 23 లక్షల ఉద్యోగాలు సృష్టించగలుగుతామని తెలిపారు. పెట్టుబడుల ఆకర్షణలో ఇప్పుడు రెండోస్థానంలో ఉన్నామని.. తొలిస్థానంలో నిలవాలన్నదే తన లక్ష్యమని వెల్లడించారు. ఈ విషయంలో దేశంలో అందరికంటే ముందుండేలా ఆంధ్రప్రదేశ్‌ను ప్రమోట్ చేయాలన్నదే తమ ప్రధాన ఉద్దేశమని చెప్పారు. సోమవారం సాయంత్రం ఇక్కడ సీఐఐ నిర్వహించిన వార్షిక సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ''ఇప్పుడు భారత్ వేగంగా పరుగులు పెడుతోంది. అన్‌స్టాపబుల్ స్థాయికి వచ్చింది. ఇప్పుడు వచ్చే సవాళ్లు తాత్కాలికమే. అంతిమంగా భారత్ వృద్ధి చాలా ప్రోత్సాహకరంగా ఉంటుంది. రాజకీయనాయకులు చాలా చెబుతుంటారు. అవి కొన్నిసార్లు చేయొచ్చు... చేయకపోవచ్చు. అయితే ప్రభుత్వాల పనితీరు గురించి తీర్పు చెప్పే న్యాయమూర్తులు పారిశ్రామికవేత్తలే. అందువల్ల ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి మా పనితీరును పరీక్షించాలని కోరుతున్నా. ఒకసారి మాతో ఎంఓయూ చేసుకుంటే దాన్ని మా ప్రాజెక్టుగా పరిగణించి విజయవంతంగా ప్రారంభించేలా చేస్తాం. ఇదే నా వాగ్దానం'' అని చంద్రబాబు పేర్కొన్నారు. 'విజన్ ఫర్ ఇండియాజీ100 ద ఫ్యూచర్' అన్న అంశంపై సీఎం తన అభిప్రాయాలు వ్యక్తంచేశారు.

**ప్రధానిగా మోదీ ఉండటం మన అదృష్టం**

నా మనసులో నిరంతరం జాతీయ, రాష్ట్ర ఎజెండాలు ఉంటాయి. ఆ రెండింటికీ సీఐఐ అండగా నిలవాలి. వికసిత్‌భారత్ తరహాలో మేం స్వర్ణాంధ్ర సాధన లక్ష్యాన్ని పెట్టుకున్నాం. 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించాలనుకుంటున్నాం. భారత్ ఇప్పుడు మరో యుగంలోకి ప్రవేశించబోతోంది. ఈ నవయుగాన్ని ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, సెమీకండక్టర్, క్లీన్ ఎనర్జీ, అధునాతన తయారీరంగం, ఇంటెలిజెంట్ లాజిస్టిక్ వ్యవస్థలు ముందుకు తీసుకెళ్లబోతున్నాయి. ఇలాంటి ముఖ్యమైన సమయంలో ప్రధానిగా నరేంద్రమోదీ ఉండటం మన అదృష్టం. భారత్ 2047 నాటికి అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించి తీరుతుంది. భారత్ 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సాధించాలని లక్ష్యంగా పెట్టుకొంది. అందులో 160 గిగావాట్లను ఆంధ్రప్రదేశ్ అందించబోతోంది. ఇప్పటికే 90 గిగావాట్ల పనులు మొదలుపెట్టాం. దానివల్లే విశాఖపట్నానికి గూగుల్ డేటా సెంటర్ వస్తోంది. దాన్ని చూసి చాలా సంస్థలు పోటీపడుతున్నాయి. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో డేటా సెంటర్ల ఏర్పాటుకు భారీ డిమాండ్ ఏర్పడింది. విద్యుత్తు సంస్కరణల కారణంగా దేశంలో తొలిసారి విద్యుత్తు టారిఫ్‌ను ఏడాదిలో 30పైసలు తగ్గించాం. ఈ ఏడాది మరో 30 పైసలు తగ్గిస్తున్నాం. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఆర్సెలార్ మిత్తల్, రెన్యూ, కాగ్నిజెంట్ లాంటి దిగ్గజ సంస్థలతోపాటు, జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రధాన కార్పొరేట్ సంస్థలు కలిసి పనిచేస్తున్నాయి.


# ప్రజావాణి అర్జీల పరిష్కారం లో జాప్యం వద్దు

* జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



జనగామ, ప్రజాస్ఫూర్తి: ప్రజావాణి లో ప్రజలు వివిధ సమస్యలతో సమర్పించే అర్జీ లను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం లోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్ లో నిర్వహించిన ప్రజావాణి కార్య క్రమం లో కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి పరిశీలించారు. ఈ సందర్భంగా మొత్తం 190 అర్జీలు అందగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు కేటాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పై తక్షణ చర్యలు తీసుకుని, త్వరితగతిన పరిష్క రించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం లో వేగం పెంచాలని, పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ బెన్ షా లోమ్, జెడ్పీ సీఈఓ రంగా రావు, మున్సి పల్ కమిషనర్ మ హేశ్వర్ రెడ్డి, సీపీఓ చిన కోట్యా నాయక్ తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డ్లో లారీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం



జనగామ,ప్రజాస్ఫూర్తి : జిల్లా కేంద్రం లోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో సోమవారం ఓ లారీ డ్రైవర్ ఆత్మహత్యా యత్నానికి పాల్పడటం కలకలం రేపింది. ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు మూడు రోజులు గా ఎదురుచూడాల్సి వస్తోందని, దీంతో వాహనానికి సంబంధించి న ఈఎంఐలు చెల్లించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయ ని డ్రైవర్ ఆవేదన వ్యక్తం చేశాడు. సరైన సమయంలో లారీలు అన్‌లోడ్ కాకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని వాపోయాడు. ఈ క్రమంలో ఆవేశానికి లోనైన డ్రైవర్ లారీ పైకి ఎక్కి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా, అక్కడే ఉన్న హమాలీ కార్మికులు వెంటనే అప్రమత్తమై అడ్డుకుని అతని కాపాడారు. ఈ ఘటన తో మార్కెట్ యార్డ్ పరిసర ప్రాంతం లో కొంతసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. రైతులు, డ్రైవర్లు ధాన్యం రవాణాలో జరుగుతున్న జాప్యంపై ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని సంబంధిత అధికారులు త్వరితగతిన అన్లోడ్ అయే విధంగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

# అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరికలు



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చివ్వెంల మండలం మొగ్గయ్య గూడెం ఇండిపెండెంట్ సర్పంచ్ ధరావత్ కృష్ణ, ఇండిపెండెంట్ ఉపసర్పంచ్ బానోత్ రాజు లు కాంగ్రెస్ పార్టీలో చేరారని ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రం వైట్ హౌస్ లో జిల్లా కాంగ్రెస్ నాయకులు గాయం ఉదయశ్రీ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలను రాజకీయంగా గుర్తించి వారికి అవకాశాలు కల్పించిన పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని అన్నారు. నేడు అనేక మంది మంచి ఉద్యోగాల్లో స్థిరపడటానికి కాంగ్రెస్ పార్టీ కృషే కారణమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ వంటి సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వ ఘనతేనని అన్నారు. గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పాలనలోనే సాధ్యమైందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో కొత్తగా చేరిన వారికి ప్రత్యేక గుర్తింపు, ప్రోత్సాహం ఉంటుందని తెలిపారు. త్వరలోనే మండల పార్టీ కమిటీ ల నియామకం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విరన్న నాయక్, మహేష్, మహేందర్ రాజు, సాయి, అఖిల్, మన్సూర్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# బండి సంజయ్ రాజీనామా చేయాలి: ఏఐఎస్ఎఫ్



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, మైనర్ బాలికపై జరిగిన లైంగిక దాడి ఘటనలో నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి కుమారుడిపై వచ్చిన పోక్సో కేసులో నిష్పక్షపాత విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి కుమారుడు మైనర్ బాలికపై అకృత్యానికి పాల్పడినట్లు బాధితులు ఫిర్యాదు చేసినా, ప్రభుత్వం కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యం చేయడం సిగ్గుచేటన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఈ కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని, వ్యవస్థలను మేనేజ్ చేస్తూ సామాన్యులకు ఒక నీతి, రాజకీయ నేతలకు ఒక నీతి అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపించాలని, నిందితుడికి శిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్, ఉపాధ్యక్షులు కోరిమి సంజయ్, నాయకులు మహేష్, స్పందన, కళ్యాణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.






# చిన్న పత్రికల సంక్షేమానికి అండగా ఉంటాం

- అక్రిడిటేషన్ కమిటీ సభ్యులకు ఘన సన్మానం
- సీఏ సర్టిఫికెట్ సమస్య పరిష్కారానికి కృషి : విరాహత్ అలీ







హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : చిన్న, మధ్య తరహా పత్రికలు, మ్యాగజైన్స్ ఎడిటర్ల సంక్షేమం కోసం తమ యూనియన్ తల్లిలా అండగా ఉంటుందని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ పేర్కొన్నారు. జిల్లా అక్రిడిటేషన్ కమిటీలకు చిన్న, మధ్య తరహా పత్రికల నుంచి సభ్యులుగా నియమితులైన వారిని తెలంగాణ స్మాల్ మీడియం న్యూస్ పేపర్స్ అండ్ మ్యాగజైన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు యూసుఫ్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విరాహత్ అలీ మాట్లాడుతూ.. చిన్న పత్రికల నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని చెప్పారు. అక్రిడిటేషన్ల జారీలో ఇబ్బందిగా మారిన సీఏ సర్టిఫికెట్ నిబంధనపై సమాచార శాఖ కమిషనర్‌తో చర్చించామని, త్వరలోనే ఈ సమస్య తొలిగిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్స్, ప్రతినెలా జారీ చేసే ప్రకటనల విషయంలో సమాచార శాఖ మంత్రి, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నాలు చేద్దామని విరాహత్ అలీ అన్నారు. కమిటీ సభ్యులుగా ఎంపికైన వారు క్షేత్రస్థాయిలో పోరాడి అర్హులైన జర్నలిస్టులందరికీ కార్డులు వచ్చేలా చూడాలని సూచించారు. పత్రికల ప్రకటనల పెండింగ్ బిల్లులు త్వరగా విడుదలయ్యేలా ప్రయత్నిస్తున్నామని, ఐకమత్యంతోనే హక్కులను సాధించుకోగలమని పిలుపునిచ్చారు. అనంతరం అక్రెడిటేషన్ కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో 'ఉదయం' దినపత్రిక ఎడిటర్ అగస్టిన్ తిరిగి యూనియన్‌లో చేరగా, ఆయనను విరాహత్ అలీ సాదరంగా ఆహ్వానించి సభ్యత్వాన్ని ఇచ్చారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అశోక్, అక్రిడిటేషన్ కమిటీ సభ్యుల సమన్వయకర్త బాలరాజు నేతృత్వంలో జరిగిన ఈ సన్మాన సభలో టియుడబ్ల్యుజె రాష్ట్ర ఉపాధ్యక్షులు ఫైజల్, మధు గౌడ్, హెచ్‌యూజే అధ్యక్షుడు శంకర్, చిన్న పత్రికల సంఘం కోశాధికారి ఆజంఖాన్, రాజిరెడ్డి, దయానంద్, అల్వాల్ హన్మంతు, ఎస్ ఎస్ కె హుస్సేన్, మాతంగి దాస్, దైవాదీనం, బాలకృష్ణ,గోల్ల రమేష్,ఆమన్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేయాలి

* కొనుగోలు కేంద్రాలలో రైతులు పడిగాపులు
* సిపిఐఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి.



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : రైతులు పండించిన వరి ధాన్యాన్ని ఐకెపి కేంద్రాలలో ప్రాతిపదికన కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. సిపిఐఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ముందు నిర్వహించిన ధర్నాలో పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి జిల్లా మంత్రులు రబీ సీజన్ ధాన్య సేకరణ పై ఇంతవరకు సమీక్ష జరుపకపోవడం దారుణం అన్నారు. ఇకనైనా జిల్లా అధికారులతో మంత్రిగారు సమీక్షించి 15 రోజుల్లో మొత్తం ధాన్యం కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల రైతాంగాన్ని సమీకరించి ఎక్కడికక్కడ నిర్బంధిస్తామని హెచ్చరించారు. జిల్లాలో 459 కొనుగోలు కేంద్రాలలో సుమారు 6 లక్షల 50 వేలకు పైగా మెట్రిక్ టన్నుల దాన్యమును కొనుగోలు చేయాలని నిర్ణయించారు. కానీ ఇప్పటి వరకు సగం కూడా కొనుగోలు చేయలేదని మండిపడ్డారు. ప్రతి రోజు రైతులు కొనుగోలు కేంద్రాలలో పడిగాపులు కాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.మా పార్టీ ప్రతినిధిబృందాలు సర్వే చేసిన కొనుగోలు కేంద్రాలలో తాలు, తేమ పేరుతో తరుగు కలిపి 40 కిలోల బస్తాకు అదనంగా 2నుండి 10కిలోలు తూకం వేస్తున్నారని, అన్ని కొనుగోలు కేంద్రాలలో తూకం వేసిన దాన్యమును వెంటవెంటనే లారీలను పంపి ఎత్తించడం లేదని తెలిపారు. లారీలు మిల్లుల వద్ద రోజుల తరబడి దిగుమతి చేయకపోవడంతో లారీలను కొనుగోలు కేంద్రాలకు పంపడం లేదన్నారు. మిల్లుల వద్ద వెయిటింగ్ ఉన్నందుకు రైతుల నుండి చార్జీలు వసూలు చేస్తున్నారని, కొన్ని కేంద్రాలలో గన్నీ బ్యాగులు కొరత ఉన్నదన్నారు. ట్రక్కు షీట్లు ఇచ్చే దగ్గర కూడా రైతులను ఇబ్బందులకు గురిచేస్తూ కొన్ని కేంద్రాలలో రైతుల వద్ద డబ్బులు కూడా వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. తాలు, తరుగు పేరుతో బస్తా దాన్యమునకు అదనపు తూకంను వేయరాదన్నారు. తూకం వేసిన వెంటనే రైతులకు ట్రక్కు షీట్ ఇవ్వాలి. ట్రక్కు షీట్ ఇచ్చి 2, 3 రోజులలో రైతులకు డబ్బు జమ చేయాలని డిమాండ్ చేశారు.కొనుగోలు కేంద్రాలకు అదనపు లారీలను పంపి వేగంగా కొనుగోలు చేసి మిల్లుల వద్ద కూడా వెంటవెంటనే దిగుమతి చేయాలన్నారు. మిల్లుల వద్ద దిగుమతి చేయని పక్షంలో ప్రత్యేకంగా ప్రయివేట్ గోదాముల్ను లీజుకు తీసుకొని దిగుమతి చేయాలని తెలిపారు. మిల్లుల వద్ద కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన దాన్యమును 'దిగుమతి చేయకుండా మిల్లర్లు కొనుగోలు చేసిన దాన్యమును దిగుమతి చేసుకుంటున్నారని అన్నారు. అనంతరం అన్ని డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, నారీ ఐలయ్య, పాలడుగు నాగార్జున, డబ్బికార్ మల్లేష్, బండా శ్రీశైలం, కందాల ప్రమీల, సయ్యద్ హాషం, వి వెంకటేశ్వర్లు, పి నర్సిరెడ్డి, గంజి మురళి, మల్లం మహేష్, దండెంపల్లి సత్తయ్య, కంబాలపల్లి ఆనంద్, బొజ్జ చిన్న వెంకులు, రాచకొండ వెంకన్న, పెంజర్ల సైదులు, పీ వరలక్ష్మి, అవిశెట్టి శంకర్, జిట్ట నగేష్, సరోజ, కొండ అనురాధ, ఉడుగుండ్ల రాములు, కొండేటి శ్రీనివాస్, రొండి శ్రీనివాస్, నన్నూరి వెంకటరమణారెడ్డి, డి రవి నాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, చేగోని సీతారాములు, రాజు, వెంకన్న, రవి, మల్లు గౌతంరెడ్డి, మన్నెం బిక్షం తదితరులు పాల్గొన్నారు.


# పశువుల అక్రమ రవాణాపై కట్టుదిట్టమైన నిఘా

* కోర్లపాడ్ టోల్ ప్లాజా చెక్‌పోస్ట్ ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : రానున్న బక్రీద్ పండుగను పురస్కరించుకుని జిల్లాలో పశువుల అక్రమ రవాణా జరగకుండా జిల్లా పోలీసు శాఖ జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేసి చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, తెలిపారు. ఇందులో భాగంగా కోర్లపాడ్ టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్ట్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. జిల్లాలోకి ప్రవేశించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ముఖ్యంగా కంటైనర్ లారీలు, లోడ్ వాహనాలు, అనుమానాస్పద వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు.వాహనాలకు సంబంధించిన పత్రాలు, పశువుల రవాణాకు అవసరమైన అనుమతులు, డ్రైవర్ల వివరాలను పూర్తిగా పరిశీలించాలని సూచించారు.అక్రమంగా పశువులను తరలించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ గారు హెచ్చరించారు. రవాణా సమయంలో పశువుల పట్ల క్రూరత్వం ప్రదర్శించినా, నిబంధనలకు విరుద్ధంగా తరలించినా సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ పశువులను రవాణా చేసే వ్యక్తులు తప్పనిసరిగా సంబంధిత అనుమతి పత్రాలు, కొనుగోలు రసీదులు, వెటర్నరీ ధృవపత్రాలు వెంట ఉంచుకోవాలని ఎస్పీ సూచించారు. వాహనాలలో సామర్థ్యానికి మించి పశువులను ఎక్కించరాదని, పశువులకు గాయాలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.రవాణా సమయంలో పశువులకు తాగునీరు, ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలని, జంతు సంరక్షణ చట్టాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అక్రమ రవాణా లేదా అనుమానాస్పద కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా, ఎవరైనా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని వాహనాలను అడ్డుకోవడం, గొడవలకు దిగడం వంటి చర్యలకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఏవైనా అనుమానాస్పద సంఘటనలు గమనించినా వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.సోషల్ మీడియాలో ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధంగా,మత విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు లేదా సందేశాలు పంపించే వారిపై ఐటీ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా జిల్లాలో శాంతిభద్రతలకు భంగం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, చెక్‌పోస్టుల వద్ద 24 గంటల పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. టోల్ ప్లాజాలు, ప్రధాన రహదారులు, అంతర్‌జిల్లా సరిహద్దుల వద్ద ప్రత్యేక నిఘా బృందాలు పనిచేస్తాయని తెలిపారు.ఈ తనిఖీల్లో జిల్లా ఎస్పి వెంట నల్లగొండ డిఎస్పీ శివరాం రెడ్డి, నకిరేకల్ సీఐ హరిబాబు, కేతపల్లి ఎస్.ఐ సతీష్,శాలిగౌరారం ఎస్.ఐ సైదులు మరియు సిబ్బంది ఉన్నారు.

# టైలరింగ్, మగ్గం, బ్యూటీషియన్ కోర్సులు పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్ల ప్రదానం



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : షాద్‌నగర్, ఫరూఖ్‌నగర్ పట్టణంలోని పాత ఆసియా వెనకాల ఉన్న కమ్యూనిటీ హాల్‌లో టైలరింగ్, మగ్గం, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగేందుకు ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రభుత్వం మహిళా అభివృద్ధి, ఆర్థిక స్వావలంబనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ , కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బ్యాటరీ వీల్ చైర్ పంపిణీ చేసిన కలెక్టర్



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: జిల్లా సమీకృత కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్ చేతుల మీదుగా లబ్ధిదారులకు బ్యాటరీ వీల్ చైర్ అందించారు. దివ్యాంగుల సహాయ ఉపకరణాలు కొరకు టీజీఓబిఎంఎంఎస్ వెబ్‌సైట్ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొని జిల్లా సెలెక్షన్ కమిటీ ద్వారా ఎంపిక అయిన బూర్గంపాడు మండలం రెడ్డిపాలెం గ్రామ దివ్యాంగుడు అయిన చిలకాల నరేష్‌కి అందించారు. ఈ కార్యక్రమములో అదనపు జిల్లా కలెక్టర్ డి.వేణుగోపాల్, జిల్లా సంక్షేమ అధికారిణి జె.ఎమ్. స్వర్ణలతా లేనినా పాల్గొన్నారు.


# ఘనంగా గోపాల్ యాదవ్ పుట్టినరోజు వేడుకలు



ప్రజాస్ఫూర్తి, కాప్రా: కుషాయిగూడ డివిజన్ సీనియర్ నాయకుడు గోపాల్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా ఈసీఐఎల్ చౌరస్తాలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొంతు శ్రీదేవి యాదవ్ కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి గోపాల్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు గోపాల్ యాదవ్ ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# అక్రమంగా జంతువులను తరలిస్తే కఠిన చర్యలు తప్పవు

**: ఎస్పీ రోహిత్ రాజు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతి భద్రతలను పటిష్టంగా అమలు చేయడంలో భాగంగా అక్రమంగా జంతువులను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ఇతర శాఖల అధికారులతో సమన్వయంతో అక్రమ జంతు రవాణాను అరికట్టేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు.జిల్లా వ్యాప్తంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని పశువుల సంతలు, బక్రీద్ దృష్ట్యా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల పనితీరుపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు.చట్ట విరుద్ధంగా ఆవులు, దూడలను అక్రమంగా రవాణా చేయడం, వధించడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి జంతువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు 02 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు, 03 అంతర్ జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి మొత్తం 05 చెక్‌పోస్టుల వద్ద 24 గంటల నిఘా కొనసాగుతోందన్నారు. ప్రతి చెక్‌పోస్టులో పోలీస్ సిబ్బందితో పాటు పశుసంవర్ధక శాఖ అధికారులు సమన్వయంతో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.జంతువుల రవాణా సమయంలో సంబంధిత చట్టాలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకుండా పశువులను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు..ప్రజలు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సోషల్ మీడియాలో విద్వేషాలను రెచ్చగొట్టేలా మార్ఫింగ్ ఫోటోలు, అసత్య ప్రచారాలు, ప్రేరేపిత పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా పోలీస్ మీడియా మానిటరింగ్ సెల్ నిరంతర నిఘా ఉంచిందన్నారు..అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. ప్రతి పండుగను పరస్పర మతాలను గౌరవించుకుంటూ శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రాణం చాలా విలువైనది.. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

* **టిజీఏఎఫ్ఎం అధ్యక్షులు డా. వసంత్ నాయక్**



ప్రజాస్ఫూర్తి, కాప్రా: ప్రాణం చాలా విలువైనదని, చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలంగాణ అకాడమీ ఆఫ్ ఫోరెన్సిక్ మెడిసిన్ (టిజీఏఎఫ్ఎం) అధ్యక్షులు డా. వసంత్ నాయక్, జనరల్ సెక్రటరీ డా. జి. మహేందర్ తెలిపారు.నేషనల్ ఫోరెన్సిక్ మెడిసిన్ డే సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో టిజీఏఎఫ్ఎం ఆధ్వర్యంలో నిర్వహించిన 5కె హెల్త్ అవేర్‌నెస్ మారథాన్‌లో ఫోరెన్సిక్ వైద్యులు, పీజీ విద్యార్థులు, వివిధ వైద్య విభాగాలకు చెందిన డాక్టర్లు పాల్గొన్నారు. "రన్ ఫర్ హెల్త్ - రన్ ఫర్ జస్టిస్" నినాదంతో నిర్వహించిన ఈ మారథాన్ ద్వారా ఆరోగ్య అవగాహన, రోడ్డు భద్రత, మానసిక ఆరోగ్యం, వ్యసనాల నివారణపై ప్రజలకు సందేశం ఇచ్చారు. ప్రతిరోజూ రోడ్డు ప్రమాదాలు, గుండెపోటులు, మద్యపానం, మానసిక ఒత్తిడి వంటి కారణాలతో జరిగే మరణాలను చూస్తున్న ఫోరెన్సిక్ వైద్యులు "నివారణే ఉత్తమ రక్షణ" అనే సందేశాన్ని సమాజానికి చేరవేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. సూరజ్, డా. కృపాల్ సింగ్, డా. నాగ మోహన్, డా. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. దాదాపు 300 మంది పాల్గొన్న ఈ మారథాన్‌లో చిన్నారులు కూడా ఉత్సాహంగా పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.


# పాపిరెడ్డి నగర్ లోని అక్రమ వాటర్ ప్లాంట్లను తొలగించాలని వినతి



శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : పాపిరెడ్డి నగర్ లోని అక్రమ వాటర్ ప్లాంట్లను తొలగించాలని కాలనీ అధ్యక్షులు చెంద్రారెడ్డి సోమవారం మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో సబ్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అక్రమ ప్లాంట్ల వలన భూగర్భ జలాలు అడుగంటాయని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నారన్నారు. భూగర్భ జలాలు అడుగంటడం వలన బోర్లు వెయ్యి ఫీట్లనుండి పదిహేను వందల ఫిట్లు వెయ్యాల్సి వస్తుందని ఇలా వెయ్యడం వలన ముందు తరాలకు నీళ్ల కరువు ఏర్పాడుతుందని వాటర్ ప్లాంట్లలో మూడు వంతుల నీరు వృధా అవుతుందని వెంటనే పాపిరెడ్డి నగర్లో ఉన్న వాటర్ ప్లాంటలని తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఆర్ భగవంత రెడ్డి. క్యాషియర్ నరసింహులు ముదిరాజ్ అడ్వైజర్ అనంతరాములు. సిహెచ్ సత్యనారాయణ రెడ్డి. ఏ. ప్రభాకర్.పి. శంకర్ రెడ్డి. ఎన్ బాల్ రెడ్డి. టి రాజిరెడ్డి కె యాదగిరి జె శంకర్ రెడ్డి వెంకటేష్ గౌడ్ మహేష్. బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# మానవ జీవితంలో యోగా ఎంతో అవసరం

* **జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వైదిక యోగ పీట్ కరుణాకర్ గురూజీ రూపొందించిన యోగాసనాలు పుస్తకాన్ని కలెక్టర్ చంద్రశేఖర్ ఆవిష్కరించి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే యోగ పట్ల అవగాహనతో పాటు నిత్య యోగ సాధన చేయడం ద్వారా మానసికంగా శారీరకంగా దృఢంగా ఉండి వ్యాధులకు దూరంగా ఉండవచ్చు అని అన్నారు. యోగాసనాల చిత్రాలతో పాటు వాటి ప్రాధాన్యత, ఎలాంటి ఆసనాలు ఎవరు చేయాలి ఎవరు చేయకూడదు అనే విషయాలను క్రోడీకరిస్తూ సమగ్ర సారాంశాలను ఈ పుస్తకాలను రూపొందించడం ద్వారా ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఎం శ్రీ యోగ టీచర్లు మంజునాథ్, జానీ, కర్నాటి శ్రీహరి, విజయ, జ్యోతి, శకుంతల, పావని వెంకట్, ప్రసాద్, మధు, శ్రీనివాస్, సంధ్య రాణి, ప్రవీణ్, జయశ్రీ, హరితరాణి, నాగజ్యోతి, సుజిత, లీలా కుమారి, దివ్య, మృదుల, వెంకటయ్య, యాదమ్మ, కోమల, వైష్ణవి, లీలా కుమారి, భారతి, నరేష్, సోమేశ్వరి, గాయత్రి, శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి


* **జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని, ప్రతి వర్షపు నీటి చుక్కను సంరక్షించుకోవాలని అన్నారు. జల్ సంచయ్ జన బాగిదారి" కార్యక్రమంలో భాగంగా నీటి సంరక్షణ చర్యలపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు ఉద్దేశించి జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రచార రథాన్ని సోమవారం ఆయన నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి తో కలిసి జండా ఊపి ప్రారంభించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జల సంరక్షణపై ప్రజలు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అన్నారు.ప్రజలలో ఈ విషయమై అవగాహన కల్పించేందుకు గాను ఏర్పాటు చేసిన ప్రచార వాహనం జిల్లాలోని అన్ని గ్రామాలను సందర్శిస్తుందని, తెలంగాణ సాంస్కృతి సారధి కళాకారుల ద్వారా నీటి సంరక్షణ, నీటి పొదుపు ,ఉన్న నీటి వనరులను ఎలా వినియోగించుకోవాలో వాటికి సంబంధించిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించడం తో పాటు,నీటి సంరక్షణ చర్యల్లో భాగంగా కమ్యూనిటీ సోక్ పిట్లు, వ్యక్తిగత సోక్ పిట్లు, నీటిని వృద్ధిపరిచేందుకు తోడ్పడే ఫామ్ పాండ్స్ ,నీటి సంరక్షణ కట్టడాలపై ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని ప్రజలందరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని, నీటి వనరులను సంరక్షించుకోవాలని, నీటి సంరక్షణకు చర్యలు చేపట్టాలని, నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములై సహకరించాలని కోరారు. నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ వర్షపు నీటిని సంరక్షించుకోవడం చాలా ముఖ్యమని, నీటిని పొదుపుగా వాడుకుంటే వచ్చే తరాల వారికి నీటి కొరత లేకుండా చూడవచ్చని, ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత నిర్మించుకోవాలని, భావితరాలను దృష్టిలో ఉంచుకొని నీటి సంరక్షణ కార్యక్రమాలు చేపట్టాలని, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇల్లు నిర్మించుకునే వారికి తప్పనిసరిగా ఇంకుడు గుంత నిర్మించుకునేలా చూస్తామని, నీటి సంరక్షణ చర్యలపై కార్పొరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, డిపిఆర్ఓ వెంకటేశ్వర్లు,స్థానిక కార్పొరేటర్ వున్న జ్ఞానేశ్వరి, కలెక్టర్ కార్యాలయ ఏ ఓ మోతిలాల్, డిఆర్డిఏ సిబ్బంది, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాబృందం, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను శాఖల వారీగా పరిష్కరిస్తూ నివేదిక సమర్పించాలి

* **జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**



మహబూబాబాద్, ప్రజా స్ఫూర్తి : ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను శాఖల వారీగా పరిష్కరిస్తూ నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సంబంధిత అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమం, ఇతర వేదికల ద్వారా ప్రజల సమస్య పరిష్కారం నిమిత్తం సామాన్య ప్రజలు చేసుకున్న ప్రతి ఒక దరఖాస్తుకు అధిక ప్రాధాన్యత ఇస్తూ తక్షణమే పరిష్కరించి నివేదికను తమకు సమర్పించాలని, తమ పరిధిలో లేని పక్షంలో సంబంధిత విభాగానికి సిఫారసు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు,ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం తో పాటు తొర్రూరు రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం, మహబూబాబాద్ రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయాలలో కూడా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు,అట్టి దరఖాస్తుల పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు, హైదరాబాద్ నుండి వచ్చిన ప్రజావాణి ప్రాజెక్ట్ డైరెక్టర్ రాకేష్ మహబూబాబాద్ జిల్లాలో అమలు చేస్తున్న ప్రజావాణి ప్రక్రియ యాప్ విధానాన్ని కలెక్టర్ స్నేహ శబరిష్ ను అడిగి తెలుసుకుని స్వయంగా పరిశీలించారు. ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ విభాగానికి చెందినవి 58, పంచాయతీరాజ్ 14, డిఆర్డిఓ 12,హౌసింగ్,డబుల్ బెడ్ రూమ్ 24,మున్సిపల్ 9,మొత్తం అన్ని విభాగాలు కలిపి (133) దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు,మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ డివిజనల్ అధికారి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో (9) దరఖాస్తులు వచ్చాయని ఆర్డీవో క్రిష్ణవేణి తెలిపారు, తొర్రూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో (14) దరఖాస్తులు వచ్చాయని ఆర్డిఓ గణేష్ తెలిపారు, ప్రజలకు నాణ్యమైన, సత్వర సేవలు అందించాలనే మంచి ఉద్దేశంతో ప్రజల సమస్యల పరిష్కారం నిమిత్తం డివిజనల్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, అందువలన ప్రతి ఒక్కరూ ప్రజలకు జవాబుదారీతనంగా ఉంటూ సేవలు అందించాలని అధికారులకు సూచించారు.కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, జడ్పీ సీఈవో (హౌసింగ్ పీడీ) పురుషోత్తం, డి ఆర్ డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డిసిఓ వెంకటేశ్వర్లు,అన్ని విభాగాల అధికారులు,కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్,డివిజన్ కార్యాలయాలలో డివిజన్ స్థాయి అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు

* **పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ కోరారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని వనమా కాలనీ, తెలంగాణ నగర్, వికలాంగుల కాలనీ, జయమ్మ కాలనీల్లోని ఇండ్లలో పాల్వంచ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో భాగంగా 300Sకు పైగా ఇండ్లలో సోదాలు నిర్వహించి సరిగా పత్రాలు, నంబర్ ప్లేట్స్ లేని 72 ద్విచక్ర వాహనాలను, 4 ఆటోలను సీజ్ చేశారు. అనంతరం కాలనీల్లో నివసించే స్థానికులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి డిఎస్పీ పలు సూచనలు చేశారు. మట్కా, జూదం, కోడిపందాలు, బెట్టింగ్, గంజాయి రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తమ కాలనీల్లోకి కొత్తగా ఎవరైనా వ్యక్తులు అద్దెకు వస్తే ఇంటి యజమానులు వారి ఆధార్ కార్డు, చిరునామాలను సేకరించి పెట్టుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలియజేసారు. విపత్కర సమయాల్లో ఆపదలో ఉన్నప్పుడు డయల్ 100కు ఫోన్ చేసి పోలీస్ వారి సేవలను పొందాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నేరాల నియంత్రణ కొరకు తమ నివాస ప్రాంతాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ ఇన్స్‌పెక్టర్ సతీష్, పాల్వంచ టౌన్ ఎస్సైలు నాగరాజు, జీవన్, కళ్యాణి, రూరల్ ఎస్సై సురేష్, ములకలపల్లి ఎస్సై మధు ప్రసాద్, బూర్గంపాడు ఎస్సై ప్రసాద్, స్టేషన్ల సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు మౌలిక వసతులకు కల్పనకు చర్యలు

* **కలెక్టర్ కె హరిత**



ఆసిఫాబాద్, ప్రజాస్ఫూర్తి : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులకు కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ కె హరిత అన్నారు సోమవారం రెబ్బెన మండలంలోని గంగాపూర్ గ్రామంలోని కస్తూరి గాంధీ బాలికల విద్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా విద్యా వారోత్సవలలో భాగంగా ఏర్పాటు చేసిన అదనపు తరగతుల గదుల నిర్మాణనికి బాలికలకు ప్రత్యేక టాయిలెట్లు నిర్మాణం పనులను ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మితోకలిసి కలెక్టర్ కె హరిత భూమి పూజ నిర్వహించారు అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమములో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు అందరికీ విద్యను అందించడం మే ప్రధాన కర్తవ్యమని అన్నారు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యనుగుణంగా అదనపు తరగతి గదుల నిర్మాణనికి చర్యలు తీసుకుంటూన్నమన్నారు నీతి అయోగ్ ఆధ్వర్యములో కేంద్ర ప్రభుత్వం ప్రతి పాఠశాలలో బాలికల కొరకు ప్రత్యేక టాయిలెట్ గదుల నిర్మాణం చేపట్టడనికి చర్యలు తీసుకుంటున్నామన్నారు సి ఎస్ ఆర్ , ఉపాధి హామీ, సర్వ శిక్ష అభియాన్ నిధులతో జిల్లాలోని ప్రతి పాఠశాలలో మౌలిక వసతులు కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు పాఠశాలలో సరైన స్థలం లేనిచోట ప్రి ఫాబ్రిక్ టాయిలెట్ గదులను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు కస్తూరి గాంధీ భాలిక విద్యాలయంలో విద్యార్థినిలకు వేసవి శిబిరాలను ఏర్పాటు చేయడం ద్వారా క్రీడలు డ్రాయింగ్ చిత్రలేఖనం వంటి వాటిపై శిక్షణ ద్వారా మేలుకువలు సాధించవచ్చు అన్నారు పదవ తరగతి, ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు కోచింగ్ వసతులను కల్పించడం జరిగిందన్నారు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు ఎమ్మెల్యే కోవా లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో చదివి విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు అనంతరం మండలంలోని తుంగేడ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఏర్పాటుచేసిన ప్రి ఫాబ్రిక్ టాయిలెట్ గదిని ప్రారంభించారు అనంతరం సర్పంచ్ తో ఎన్నికైనతరం గ్రామంలో ఏం పనులు చేపట్టారని సమస్యలను అడిగి తెలుసుకున్నారు గ్రామానికి తన వంతు కృషి చేస్తానని కలెక్టర్ పేర్కొన్నారు ఈ కార్యక్రములో సర్పంచులు పిఎసిఎస్ అధ్యక్షులు కర్నాథం సంజీవ్ తాసిల్దార్ సూర్యప్రకాష్ ఎంపీడీవో శంకరమ్మ ఉపాధ్యక్షులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# పారదర్శకతతో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలి

* **జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా**



వికారాబాద్ , ప్రజాస్ఫూర్తి : ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించి, బాధితులకు తక్షణ భరోసా కల్పించడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో "ప్రజావాణి" కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, స్వయంగా ఫిర్యాదుదారులను కలిసి, వారి సమస్యలను ఓపికగా అడిగి తెలుసుకున్నారు. బాధితులు తమ ఫిర్యాదుల కోసం ఎప్పుడైనా ఎస్పీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, ఆపదలో ఉన్న వారికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆమె హామీ ఇచ్చారు. నేటి ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల నుండి పలు ఫిర్యాదులు అందడం జరిగింది. వీటిపై తక్షణమే స్పందించిన ఎస్పీ, సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు ఫోన్ ద్వారా సంప్రదించి, ఫిర్యాదుల గురించి ఆరా తీశారు. చట్ట పరిధిలో ఉన్న సమస్యలను ఏమాత్రం జాప్యం చేయకుండా, పూర్తి పారదర్శకతతో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు మరియు బలహీన వర్గాల ఫిర్యాదుల పట్ల అత్యంత మానవత్వంతో వ్యవహరించాలని సూచించారు.అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీని కంప్యూటరైజ్ చేస్తున్నామని, తద్వారా ఫిర్యాదు పరిష్కారమయ్యే వరకు ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించేలా ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. బాధితులు అవసరం అనుకుంటే నేరుగా తనను కలవవచ్చని తెలిపారు.


# అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



ప్రజా స్ఫూర్తి, కూసుమంచి : మాజీ సర్పంచ్ భర్త దామళ్ల సుధాకర్ (49) ఇంట్లో ఫ్యానుకి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కూసుమంచి మండలం చౌటపల్లి గ్రామంలో చోటు చేసుకునది వివరాల్లోకి వెళితే సుధాకర్, భార్య మమత వారికి ఉన్న వ్యవసాయ భూమి తో పాటు కోంత భూమి కౌలుకి తీసుకోని వ్యవసాయం చేస్తున్నామని అట్టి వ్యవసాయంనకు పెట్టిన పెట్టుబడికు చేసిన అప్పులు తిరక వ్యవసాయం వల్లన నష్టం వచ్చిందని అప్పులు ఎట్ల తీర్చాలి అని భార్యాభర్తల ఇద్దరం చర్చించుకున్నాము.ఇరువురు మధ్య గోడవ జరుగుతుందని ఆదివారం రాత్రి 10గంటల సమయంలో అదే విషయంపై గొడవ పడగా తన భర్త సుధాకర్ మనస్తాపం చెంది ఫ్యాన్ కి సున్నితో ఉరి వెసుకుని చనిపోయినాడు అని భార్య దామళ్ళ మమత ఫిర్యాదు చేయగా కూసుమంచి ఎస్ ఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలు పేద, మధ్య తరగతి వర్గాలకు కొండంత అండ

* **షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ "వీర్లపల్లి శంకర్"**
* **గ్రామ సర్పంచుల సమక్షంలో చెక్కులు అందుకున్న గ్రామీణ లబ్ధిదారులు**



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలు పేద, మధ్య తరగతి వర్గాలకు కొండంత అండగా నిలుస్తున్నాయని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే ప్రభుత్వ క్యాంపు కార్యాలయంతో పాటు ఎంపీడీవో సమావేశ మందిరంలో వేరువేరుగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. షాద్ నగర్ టౌన్ లో 64, ఫరూక్ నగర్ లో 134 మంది లబ్ధిదారులకు షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే శంకర్ చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందేమోహన్ కాంగ్రెస్, బిఆర్ఎస్ కౌన్సిలర్లు రాజు నాయక్, ఎస్పీ శివ, గోపాల్, పెంటయ్య తదితరులు, వెల్జెర్ల గ్రామ సర్పంచ్ బాబు నాయక్, లింగారెడ్డి గూడ గ్రామ సర్పంచ్ ప్రవీణ్, ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్ తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో నాగయ్య, కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, సుదర్శన్ గౌడ్, బాలరాజ్ గౌడ్, రాయికల్ శ్రీనివాస్, పురుషోత్తం రెడ్డి, ముబారక్ అలీ ఖాన్, యాదగిరి యాదవ్, జంగారి రవి, జంగారి జంగయ్య, సోలిపూర్ అనిల్, నల్లముని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ ఆఫీస్‌లోనే అన్ని ఫైళ్లు నిర్వహించాలి

**: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా..**



జనగామ,ప్రజాస్ఫూర్తి : కార్యాలయాల్లో భౌతిక (ఫిజికల్) ఫైళ్ల నిర్వహణకు స్వస్తి పలికి, అన్ని ఫైళ్లను ఈ ఆఫీస్ విధానం లోనే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మొదటి అంతస్తులో ఉన్న జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయం లోని అన్ని సెక్షన్లను పరిశీలించి, సిబ్బంది పనితీరు, ఫైళ్ల నిర్వహ ణ విధానం, సెక్షన్ల పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ కార్యాలయాల్లో భౌతిక ఫైళ్ల నిర్వహణ తగ్గించి, అన్ని రికార్డులు డిజిటల్ విధానంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ఆఫీస్‌లోనే అన్ని ఫైళ్లు అందుబాటులో ఉండే లా సమగ్ర నిర్వహణ చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రతి సెక్షన్ లో రికార్డుల క్రమబద్ధీకరణ, పెండింగ్ అంశాల పరిష్కారం, ఫైళ్ల నిర్వహ ణ పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కార్యాలయ వ్యవస్థ ను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు.

## ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో పరిశీలించడం ప్రతి పౌరుడి బాధ్యత

* **బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో పరిశీలించడం ప్రతి ఒక్క పౌరుడి బాధ్యత అని బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు సోమవారం జగద్గిరిగుట్ట డివిజన్ లోని ఆర్య వైశ్య సంఘం కమ్యూనిటీ హాల్ లో స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ (సర్ )పై నిర్వహించిన అవగాహన సమావేశాన్ని స్థానిక మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన డివిజన్ కు చెందిన నాయకుల, బిఎల్ఏలకు అవగాహన కార్యక్రమ నిర్వాహణ,పాటించవలసిన నియమ, నిబంధనలు,సర్ కార్యక్రమ ప్రాముఖ్యత,తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నాయకులకు బిఎల్ఏలకు అవగాహన కల్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ 2002 జనాభా ప్రాతిపదికన ఎన్నికల సంఘం అద్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సర్ కార్యక్రమంలో నిజమైన ఓటర్లను గుర్తించడంతో పాటు,డూప్లికేట్ ఓట్లు,పర్మినెంట్ మైగ్రేటెడ్ ఓట్లు,అసలు మనుషులు లేని పేర్లతో ఉన్న ఓట్లను గుర్తించడం,కుటుంబసభ్యుల ఓట్లను మ్యాపింగ్ చేయడం,కొత్త ఓటర్లను చేర్చడం,ఏమైనా చేర్పులు,మార్పులు ఉంటే వాటిని సరిదిద్దేలా నాయకులు,బిఎల్ఏలు,సంక్షేమ సంఘాల నాయకులు,సీనియర్ సిటిజన్స్,యువత ఒక బాధ్యతగా తీసుకొని ప్రజలను చైతన్య పరుస్తూ అధికారులను సమన్వయ పరుచుకుంటూ సర్ కార్యక్రమాన్ని సద్వినియోగ పరుచుకోవాలనేలా పనిచేయాలన్నారు. ఓటరు జాబితాలో ఎటువంటి తప్పులు లేకుండా నాయకులు,బిఎల్ఏలు అప్రమత్తతో పనిచేయాలన్నారు అదేవిధంగా రానున్న రోజుల్లో బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో పార్టీ బలోపేతంకై చేపట్టనున్న సభ్యత్వ నమోదు కార్యక్రమం,నూతన కమిటీల నియామకంతో పాటు పార్టీ బలోపేతానికి మరింత ప్రజల్లోకి ఎలా దూసుకువెళ్లాలనే చేపట్టవలసిన కార్యాచరణను వివరించారు.ఈ కార్యక్రమంలో మాజీ డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్,యువ నాయకులు కొలుకుల జైహింద్, జగద్గిరిగుట్ట శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు,పలు సంక్షేమ సంఘాల నాయకులు,మహిళా నాయకురాళ్లు,అనుబంధ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అందులో రాజకీయం లేదు.. ప్రధాని పిలుపును స్వాగతిస్తున్నాం

**: సీఎం రేవంత్‌రెడ్డి**



హైదరాబాద్: తమతో కలిసి రావాలన్న ప్రధాని మోదీ పిలుపును స్వాగతిస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సోమవారం మీడియాతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఆదివారం ప్రధాని అధికారిక కార్యక్రమంలో పాల్గొన్నానని, ఆయన పిలుపులో రాజకీయాలకు తావులేదని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమంలో కేంద్రంతో కలిసి వెళ్లేందుకు తనకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. వికసిత్ భారత్‌లాగే విజన్ 2047 సాధనకు, 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ అందుకునేందుకు కేంద్రంతో కలిసి నడుస్తామన్నారు. కేంద్రం, రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణితో ముందుకెళ్లాలని తెలిపారు. తమ పార్టీలు, ఐడియాలజీ వేరైనా.. అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తామన్నారు. ఎన్నోసార్లు కలిసినా.. కేంద్రం నుంచి ఆశించిన మద్దతు రాలేదని, 2 గంటలు సమయమిస్తే తమ ప్రణాళికలు ప్రధానికి వివరిస్తామని చెప్పారు.

## ధాన్యం ఫుల్...కొనుగోలు నిల్..!

* **కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక రోడ్ల మీదనే ధాన్యం**
* **ధాన్యం కొనుగోళ్లులలో రైతులకు జరుగుతున్న అన్యాయాలపై చర్య తీసుకోవాలి**
* **సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ బండారి ఐలయ్య డిమాండ్**



ప్రజా స్ఫూర్తి ,పాలేరు : వర్షాల వల్ల నష్టం అకస్మాత్తుగా కురిసే వర్షాలకు రోడ్లపై ఉన్న ధాన్యం తడిసి, రంగు మారి కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రైతు పండించిన పంటలకు గిట్టుబాటు మద్దతుధర కల్పించాలని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలలో నిల్వ ఉన్న పంటను ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చెయ్యాలని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి బండారి ఐలన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తిరుమలాయపాలెం మండలం తిప్పారెడ్డిగూడెం గ్రామంలో జిల్లా ముఖ్య కార్యకర్తల జనరల్ బడి జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి బండారి ఐలన్న మాట్లాడుతూ జిల్లాలో మొక్కజొన్న పంటకు సరైన ధర లభించడం లేదని, రైతులు మధ్యవర్తుల చేతిలో దోపిడీకి గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. కనీస మద్దతు ధర (MSP) ప్రకటించినప్పటికీ, ఆ ధరకు కొనుగోళ్లు జరగడం లేదని, రైతులు నష్టాలతో పంటను అమ్ముకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతుల నుండి నేరుగా పంట కొనుగోలు చేయాలని ఆయన కోరారు.వరి ధాన్యం కొనుగోలు విషయంలో పరిస్థితి మరింత దారుణంగా ఉందని ఐలన్న విమర్శించారు. ధాన్యం తేమ శాతం పేరుతో అనవసరంగా తిరస్కరించడం, తూకంలో అవకతవకలు, ఆలస్యంగా చెల్లింపులు వంటి సమస్యలు రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్నాయని తెలిపారు. అనేక చోట్ల కొనుగోలు కేంద్రాలు సకాలంలో ప్రారంభం కాకపోవడం వల్ల రైతులు తమ పంటను తక్కువ ధరలకు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తోందని అన్నారు.రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపులు వెంటనే చేయాలని, గరిష్టంగా 48 గంటలలోపు రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తేమ శాతం ప్రమాణాలను పారదర్శకంగా అమలు చేయాలని, తూకం ప్రక్రియను డిజిటల్ పద్ధతుల్లో నిర్వహించాలని సూచించారు.అలాగే, గోదాముల కొరత, రవాణా సమస్యల వల్ల ధాన్యం నిల్వ చేయలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రతి గ్రామ స్థాయిలోనే నిల్వ కేంద్రాలు ఏర్పాటు చేసి, సరైన మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. మొక్కజొన్న మరియు వరి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉద్ధృతం చేస్తామని బండారి ఐలన్న హెచ్చరించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించి, అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసి రాష్ట్ర నాయకులు మందుల రాజంద్ర ప్రసాద్, జిల్లా నాయకులు వెంకటరామిరెడ్డి, సురేష్, ప్రకాష్, కాశీం, మోహన్ రావు, జానకి, మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్, అచ్చ ఉప్పలయ్య, నాగయ్య, వెంకటేశ్వర్లు, వి వి రావు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డు పరిశీలించిన మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్చంద్ర


* **డంపింగ్ యార్డ్ లో మంటలు రాకుండా చూడాలి**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి: వేసవి తీవ్రత దృష్ట్యా డంపింగ్ యార్డులో ఎట్టి పరిస్థితుల్లోనూ మంటలు, పొగలు రాకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ బి. శరత్ చంద్ర ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వ రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీ బి. శరత్ చంద్ర సోమవారం నగరంలోని రిసోర్స్ పార్క్ (డంపింగ్ యార్డు)ను ఆకస్మికంగా పరిశీలించారు.డంపింగ్ యార్డులో కొనసాగుతున్నబయోమైనింగ్ పనులు, అగ్ని ప్రమాద నివారణ చర్యలు, పొగ నియంత్రణ పరిస్థితులను కమిషనర్ గారు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్తీక్, అసిస్టెంట్ ఇంజనీర్ అసీమ్ బాబా, శానిటరీ ఇన్స్పెక్టర్ ఎన్. ప్రదీప్ రెడ్డి, డంపింగ్ యార్డు ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్ శశిధర్ తదితర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం నెలకొన్న తీవ్ర ఎండలు, అధిక ఉష్ణోగ్రతల కారణంగా డంపింగ్ యార్డులో మంటలు, పొగలు ఏర్పడుతున్న నేపథ్యంలో కమిషనర్ అధికారులకు కఠిన ఆదేశాలు జారీ చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ డంపింగ్ యార్డులో మంటలు చెలరేగకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, వాటర్ ట్యాంకర్ల ద్వారా నిరంతరం నీటిని చల్లి పొగలు, మంటలను పూర్తిస్థాయిలో అదుపులో ఉంచాలని ఆదేశించారు. అలాగే ఇటీవల త్రవ్వించిన కొత్త బోర్‌వెల్‌కు తక్షణమే మోటార్ ఏర్పాటు చేసి, అక్కడి నుంచి నీటిని తీసుకుని డంపింగ్ యార్డులో వినియోగించాలనీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మరియు అసిస్టెంట్ ఇంజనీర్‌లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భవిష్యత్తులో ఎటువంటి అగ్నిప్రమాదాలు సంభవించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.రిసోర్స్ పార్క్‌లో ప్రస్తుతం సుమారు 65 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు ఉండగా, అందులో 14 వేల మెట్రిక్ టన్నుల బయోమైనింగ్ పనులు పురోగతిలో ఉన్నట్లు అధికారులు కమిషనర్ గారికి వివరించారు. బయోమైనింగ్ ఏజెన్సీ "రేకార్ట్" ప్రతినిధులకు పనులను మరింత వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ గారు ఆదేశించారు. డంపింగ్ యార్డు పరిసర ప్రాంత ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కాలుష్య నియంత్రణ చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని, నగర పరిశుభ్రత మరియు పర్యావరణ పరిరక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని కమిషనర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్తీక్, అసిస్టెంట్ ఇంజనీర్ అసీమ్ బాబా, శానిటరీ ఇన్స్పెక్టర్ ఎన్. ప్రదీప్ రెడ్డి, డంపింగ్ యార్డు ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్ శశిధర్, బయోమైనింగ్ ఏజెన్సీ ప్రతినిధులు, మున్సిపల్ ఇంజనీరింగ్ మరియు శానిటేషన్ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

## అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు నెలనెలా వేతనాలు చెల్లించాలి

**: సుంచు విజేందర్.**



జనగామ,ప్రజాస్ఫూర్తి: అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు నెలనెలా వేతనాలు సక్రమంగా చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న ఏప్రిల్ నెల వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు సోమవారం డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుంచు విజేందర్, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బైరగోని అంజమ్మ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న అంగన్వాడీ సిబ్బంది పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. చేసిన పనికి నెలనెలా వేతనాలు కూడా సకాలంలో అందక అంగన్వాడీ టీచర్లు, ఆయాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రీ ప్రైమరీ విధానాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, ప్రీ ప్రైమరి విద్యను అంగన్వాడీల ద్వారానే నిర్వహించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి భద్రత కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న సెంటర్ల అద్దెలను వెంటనే చెల్లించాలని కోరారు. కొత్తగా అందించిన సెల్‌ఫోన్లు సరిగా పని చేయడం లేదని, అన్ని యాప్స్, సౌకర్యాలతో కూడిన 5జీ ఫోన్లు అందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 180 చట్టాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని, కేంద్ర శిశు సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు బీఎల్ఓ విధులను రద్దు చేసి, ఐసీడీఎస్ కు సంబంధం లేని పనులు అప్ప గించరాదని కోరారు. ఎన్నికల మేనిఫెస్టో లో కాంగ్రెస్ పార్టీ అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు రూ.18 వేల వేతనం, పీఎఫ్ సౌకర్యం వంటి హామీలు ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు పూర్త వుతున్నప్పటికీ హామీలు అమలు చేయకపోవడం, ఖాళీ పోస్టులు భర్తీ చేయకపోవడం వల్ల అదనపు పనిభారం పెరిగి అంగన్వాడీ సిబ్బంది అనారోగ్యాలకు గురవు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు పి.బిక్షం, సహాయ కార్యదర్శి ఎర్రబెల్లి సంతోష్, జిల్లా కమిటీ సభ్యులు టి.సంతోష, జ్యోతి, సుమతి, శోభ, సుజాత, లక్ష్మి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

## మహాదేవపురం నుండి సికింద్రాబాద్ కు బస్సు సర్వీస్ ప్రారంభం



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : గాజులరామారం డివిజన్ మహాదేవపురం నుండి సికింద్రాబాద్ కు నూతనంగా ఏర్పాటు చేసిన బస్సు సర్వీస్ ను సోమవారం బిఆర్ఎస్ ఎల్పి విప్,కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉండే ఈ బస్ సర్వీస్ ను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో బాలయ్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఈ.నాగేష్,సంక్షేమ సంఘం సభ్యులు గంగయ్య, సునీల్ కుమార్ వర్మ, పార్వతి, సీఎస్. సాయిలు, మాజీ డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్ , నవాబ్,ఇమ్రాన్ బేగ్,ముసాఖాన్,బోయిని మహేష్,చిన్నా చౌదరి, సాయిబాబా, రాములు గౌడ్, నవీన్, మహేష్, శ్రావణ్, ప్రసాద్ ,శివానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అలా చెప్పడం ప్రధాని హోదాకు తగదు

**: మంత్రి పొన్నం**



హైదరాబాద్: ప్రధానమంత్రి మోదీ తెలంగాణకు వచ్చి అభివృద్ధికి నిధులేమీ ఇవ్వకుండా పెట్రోల్, బంగారం, వంట నూనె వాడవద్దని చెప్పి వెళ్లారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు. తెలంగాణకు ప్రధాని వస్తే రాష్ట్రానికి మేలు జరుగుతుందని ప్రజలు ఆశించారని, కానీ అభివృద్ధికి నిధులేమీ ప్రకటించకుండా పెట్రోల్, డీజిల్ వాడవద్దు.. బంగారం కొనవద్దు.. వంట నూనె వాడవద్దు అని చెప్పడం ప్రధాని హోదాకు తగదని అన్నారు. సోమవారం మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడుతూ.. వేలాది కార్లతో రోడ్ షో చేసిన మోదీ ప్రజలకు భరోసా ఇవ్వాల్సింది పోయి భయాందోళనలు కలిగించారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సీబీఐ దర్యాప్తు చేయాలని భాజపా నేతలు గతంలో డిమాండ్ చేశారని, ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించినా కేంద్రం ఎందుకు చేయడం లేదని మంత్రి ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడిన 12 ఏళ్లలో కేంద్రం ఏం చేసిందో చెప్పాలని సవాల్ విసిరారు. ఆర్ఆర్ఆర్ నిధులు, మెట్రో నిధులు, రేడియల్ రోడ్లు, గోదావరి పుష్కరాలకు ప్రత్యేక నిధులు సహా రాష్ట్రానికి కావాల్సిన అభివృద్ధి అంశాలపై తెలంగాణలోని 8 మంది భాజపా ఎంపీలు.. ఒక్క వినతిపత్రమైనా ఇచ్చారా? అని మంత్రి నిలదీశారు. బీసీ హక్కులు, దేవాలయాల అభివృద్ధి, క్యూర్ ఏరియా అభివృద్ధి వంటి కీలక అంశాలపై తెలంగాణ భాజపా నేతలు మాట్లాడటం లేదని మంత్రి విమర్శించారు. రాహుల్ గాంధీ సూచనలతో తెలంగాణలో కులగణన నిర్వహించామని, జనగణనలో బీసీ కులాల వివరాలు చేర్చాలని కేంద్రాన్ని కోరినా మోదీ సర్కార్ స్పందించడం లేదని మంత్రి పొన్నం ఆరోపించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ నెరవేర్చలేదని విమర్శించారు. బండి సంజయ్ కుమారుడిపై వచ్చిన ఆరోపణల విషయంలో కేంద్ర మంత్రి హోదా ఉపయోగించి విచారణ అడ్డుకోవద్దన్నారు. విచారణ నిష్పక్షపాతంగా జరగాలని, దోషులకు శిక్ష తప్పదని స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

## రూ.2 కోట్ల విలువైన 400 కిలోల గంజాయి సీజ్.. అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

గచ్చిబౌలి: రాష్ట్రాల సరిహద్దులు దాటి గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న భారీ గంజాయి అక్రమ రవాణాను సైబరాబాద్ పోలీసులు గుట్టురట్టు చేశారు. పక్కా సమాచారంతో కూకట్‌పల్లి ఎస్‌వోటీ బృందం, పటాన్‌చెరు పోలీసులతో కలిసి దాడులు చేశారు. రూ.2 కోట్ల విలువైన 400 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసులో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేయగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. సోమవారం శేరిలింగంపల్లి డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీసీపీ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన మనీషా పద్వాల్ గంజాయి వ్యాపారంలో భారీ లాభాలు గడించాలనే ఉద్దేశంతో ఒడిశాకు చెందిన సరఫరాదారు ట్రిబ్యూన్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. వీరిద్దరికీ ప్రతాప్ హరిదాస్ పవార్(24) మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నాడు. ఈ నెల 8న మహారాష్ట్ర నుంచి నిందితులు డీసీఎం వాహనంలో ఒడిశాలోని మల్కన్‌గిరికి గంజాయి కోసం బయలుదేరారు. కాగా సరఫరాదారు ట్రిబ్యూన్.. ప్రతాప్‌కు ఫోన్ చేసి గంజాయి రాజమండ్రి చేరుకుందని.. అక్కడి నుంచి తీసుకెళ్లాలని చెప్పడంతో నిందితులు అక్కడికి చేరుకొని అనుమానం రాకుండా డీసీఎంలో లోడ్ చేశారు. దానిపై ఖాళీ కూరగాయల ప్లాస్టిక్ ట్రేలను పేర్చారు. కారును ఎస్కార్ట్‌గా వాడుతూ నగరానికి చేరుకొని, ఔటర్ రింగ్ రోడ్ మీదుగా మహారాష్ట్రకు తరలిస్తుండగా.. సోమవారం ఉదయం ముత్తంగి వద్ద కూకట్‌పల్లి ఎస్‌వోటీ, పటాన్‌చెరు పోలీసులు మాటు వేసి పట్టుకున్నారు.

**అరెస్టయిన నిందితులు**



మహారాష్ట్రకు చెందిన ప్రతాప్ హరిదాస్ పవార్, డీసీఎం యజమాని ఆనంద్ మాయప్ప హోవల్(34), కారు యజమాని బాలాజీ గణేశ్ హోన్మణి(35), డీసీఎం డ్రైవర్లు రోహిత్ హోవల్ (27), చందన్‌శివే ఔదుంబర్(46), రంజిత్ రాజేందర్ గడగే(27)తో పాటు బాలుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా పరారీలో ఉన్న ప్రధాన నిందితులు మనీషా, ట్రిబ్యూన్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. గంజాయితో పాటు డీసీఎం, కారు, ఆరు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితులు గంజాయి రవాణాకు సంబంధించిన లావాదేవీలను హవాలా రూపంలో నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. సరకు పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన పోలీసులను డీసీపీ అభినందించారు. సమావేశంలో ఎస్‌వోటీ డీసీపీ పి.శోభన్‌కుమార్, అడిషనల్ డీసీపీ విశ్వప్రసాద్, ఏసీపీ శ్రీనివాస్, పటాన్‌చెరు ఇన్‌స్పెక్టర్ జి.వినాయక్‌రెడ్డి, డీఐ బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి నియమితులయ్యారు. కమిషన్ ఛైర్‌పర్సన్, ఆరుగురు సభ్యులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో సభ్యులుగా శ్రీకాంతాచారి తల్లి కాసోజు శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనవరాలు చిట్యాల శ్వేత ఉన్నారు. వీరితో పాటు శశికళ యాదవరెడ్డి, సదాలక్ష్మి, రాధాబాయి, ఉజ్మా షకీరా సభ్యులుగా ఉన్నారు. ఈ కమిషన్ ఐదేళ్ల పాటు కొనసాగనుంది.



# పశ్చిమాసియా ఎఫెక్ట్..
# కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు

**పశ్చిమాసియా ఉద్రిక్తతలతో స్టాక్ మార్కెట్ల భారీ పతనం**

**1300 పాయింట్లకు పైగా నష్టపోయిన సెన్సెక్స్**

**360 పాయింట్లు పతనమైన నిఫ్టీ**

**ఫార్మా, ఎఫ్ఎంసీజీ రంగాల వైపు ఇన్వెస్టర్ల చూపు**



**ముంబై:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు భారత స్టాక్ మార్కెట్లను కుదిపేశాయి. ప్రపంచ వృద్ధి, ద్రవ్యోల్బణంపై ప్రతికూల ప్రభావం పడుతుందనే ఆందోళనలతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గుచూపారు. సోమవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 1312.91 పాయింట్లు నష్టపోయి 76,015.28 వద్ద ముగిసింది. నిఫ్టీ 360.3 పాయింట్లు పతనమై 23,815.85 వద్ద ముగిసింది.

భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు సుదీర్ఘకాలం కొనసాగుతాయనే భయాలు, బలహీన అంతర్జాతీయ సంకేతాలు మార్కెట్ సెంటిమెంట్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. ఈ ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు ధరలు పెరిగే అవకాశం ఉందని, ఇది ద్రవ్యోల్బణాన్ని మరింత పెంచుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ఆందోళనలతో ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. ట్రేడింగ్‌లో దాదాపు అన్ని రంగాల షేర్లు ఒత్తిడికి గురయ్యాయి. ముఖ్యంగా నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్ సూచీ ఏకంగా 4 శాతం పతనమైంది. రియాల్టీ, పీఎస్‌యూ బ్యాంక్, మీడియా రంగాల షేర్లు కూడా భారీగా నష్టపోయాయి. మరోవైపు ఎఫ్ఎంసీజీ, ఫార్మా, హెల్త్‌కేర్ వంటి రక్షణాత్మక రంగాల షేర్లు కొంతవరకు నిలదొక్కుకున్నాయి. నిఫ్టీలో టైటాన్ కంపెనీ, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ (ఇండిగో), ఎస్‌బీఐ షేర్లు ప్రధానంగా నష్టపోగా, కోల్ ఇండియా, అదానీ పోర్ట్స్, హిందుస్థాన్ యూనిలీవర్ లాభపడ్డాయి. కాగా, మార్కెట్ సెంటిమెంట్ మెరుగుపడాలంటే నిఫ్టీ 24,000 స్థాయిని దాటాల్సి ఉంటుందని నిపుణులు పేర్కొన్నారు. ఇదే సమయంలో భారత రూపాయి విలువ కూడా డాలర్‌తో పోలిస్తే రికార్డు కనిష్ఠ స్థాయి (రూ. 95.80)కి పడిపోవడం మార్కెట్‌పై అదనపు ఒత్తిడిని పెంచింది.

# భారత్‌లో డుకాటీ పనిగేల్ వీ4
# లంబోర్గిని స్పెషల్ ఎడిషన్ బైక్

**లిమిటెడ్ ఎడిషన్ బైక్ కోసం బుకింగ్స్ పూర్తయినట్లు వెల్లడించిన డుకాటీ**

**ప్రపంచవ్యాప్తంగా 630 యూనిట్లను మాత్రమే ఉత్పత్తి**

**బైక్ బరువు తగ్గడం కోసం కార్బన్ ఫైబర్ వినియోగం**



**న్యూఢిల్లీ:** ఇటాలియన్ మోటార్ సైకిల్ తయారీ సంస్థ డుకాటీ అత్యంత ప్రీమియం, పరిమిత ఎడిషన్ బైక్ 'డుకాటీ పనిగేల్ వీ4 లంబోర్గిని'ని తీసుకువచ్చింది. దీని ఎక్స్ షోరూమ్ ధర రూ.1 కోటి. ఈ లిమిటెడ్ ఎడిషన్ సూపర్ బైక్ కోసం ఇప్పటికే బుకింగ్స్ పూర్తయినట్లు డుకాటీ తెలిపింది. మొదటి మోటార్ సైకిల్‌ను ముంబైలో డెలివరీ చేసినట్లు వెల్లడించింది.

పనిగేల్ వీ4 లంబోర్గిని బైక్‌లను ప్రపంచవ్యాప్తంగా 630 యూనిట్లు మాత్రమే ఉత్పత్తి చేస్తారు. భారత్‌కు వచ్చిన అత్యంత అరుదైన మోటార్ సైకిళ్లలో ఇది ఒకటిగా నిలుస్తుంది. డుకాటీ మరింత ప్రత్యేకమైన 'స్పెషాలీ క్లయింటి' ఎడిషన్‌ను కూడా తయారు చేస్తోంది. వీటిని ప్రపంచవ్యాప్తంగా 63 యూనిట్లను మాత్రమే తయారు చేస్తోంది. ప్రత్యేకంగా లంబోర్గిని కార్ల యజమానుల కోసం వీటిని తయారు చేస్తుండగా, యజమానులు తమ కార్ల రంగుల్లోనే బైక్‌ను కూడా కాన్ఫిగర్ చేసుకునే వెసులుబాటు ఉంది. డుకాటీ పనిగేల్ వీ4 ఎస్, లంబోర్గిని రెవుయెల్టో స్ఫూర్తితో పఃనిగేల్ వీ4ను తీర్చిదిద్దారు. డుకాటీ స్ట్రీట్ ఫైటర్ వీ4 లంబోర్గిని, డయావెల్ 1260 లంబోర్గిని తర్వాత, డుకాటీ, లంబోర్గిని కలిసి తీసుకువచ్చిన మూడో బైక్ డుకాటీ పనిగేల్ వీ4 లంబోర్గిని. ఈ మోటార్ సైకిల్‌ను డుకాటీ సెంట్రో స్టైల్ మరియు లంబోర్గిని సెట్రో స్టైల్ డిజైన్ బృందాలు సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. ఈ బైక్‌లో ఎక్స్‌పోజ్డ్ కార్బన్ ఫైబర్‌తో పాటు వెర్డే స్కాండల్, గ్రిజియో టెలెస్టో, గ్రిజియో అచెసో యాక్సెంట్‌లు ఉంటాయి. ఫోర్డ్స్ అల్యూమినియం వీల్స్, రీడిజైన్ చేయబడిన టెయిల్ సెక్షన్, వింగ్‌లెట్‌లు అన్నీ లంబోర్గిని ఫ్లాగ్‌షిప్ హైబ్రిడ్ సూపర్‌కార్ డిజైన్ లాంగ్వేజ్‌ను ప్రతిబింబించేలా రూపొందించినట్లు డుకాటీ చెబుతోంది. ముఖ్యంగా బైక్ బరువు తగ్గడానికి, ప్రత్యేకత కోసం విస్తృతంగా కార్బన్ ఫైబర్ ఉపయోగించారు. ఫెయిరింగ్, మడ్ గార్డ్స్, హీల్ గార్డ్స్, చైనా గార్డ్, ఎగ్జాస్ట్ ప్రొటెక్షన్, ట్యాంక్ ప్రొటెక్షన్, రేడియేటర్ డక్ట్ వంటి భాగాలన్నీ కార్బన్ ఫైబర్‌తో తయారు చేసినట్లు తెలిపింది. ఈ బైక్‌కు 1,103సీసీ డెస్మోసెడిసి స్ట్రాడేల్ వీ4 ఇంజన్‌ను అమర్చారు. దీనికి 6 స్పీడ్ గేర్ బాక్సు, స్లిప్పర్ డ్రై క్లచ్‌లను ఏర్పాటు చేశారు. పనిగేల్ వీ4 లంబోర్గిని బైక్ బరువు 185 కిలోలు ఉంటుంది. పనిగేల్ సిరీస్ లో వచ్చిన అత్యంత తేలికైన మరియు అత్యంత పవర్‌ఫుల్ బైక్ ఇది.

# భారత్‌లో ఏఐ వాడకం జోరు..

**ఆఫీసుల్లో 86% ఉద్యోగుల వినియోగం..**




**న్యూఢిల్లీ:** భారతదేశంలోని కార్యాలయాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం గణనీయంగా పెరిగింది. దేశంలో దాదాపు 86 శాతం మంది ఉద్యోగులు తమ రోజువారీ పనిలో ఏఐని వాడుతున్నప్పటికీ, దానిపై పెట్టిన పెట్టుబడికి తగిన రాబడి అంచనాలకు తగ్గట్టుగా ఉందని కేవలం 35 శాతం మంది మాత్రమే సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే, ఈ విషయంలో ప్రపంచ సగటు (22%) కంటే భారత్ మెరుగ్గా ఉండటం గమనార్హం. ఈ వివరాలను టెక్నాలజీ నిపుణుల సంస్థ ఇసాకా సోమవారం విడుదల చేసిన తన నివేదికలో వెల్లడించింది.

### ఏఐ వాడకంలో భారత్ టాప్

నివేదిక ప్రకారం భారతదేశంలోని 49 శాతం సంస్థలు ఇప్పుడు పూర్తిస్థాయి, అధికారిక ఏఐ విధానాన్ని కలిగి ఉన్నాయి. 2025లో ఇది 32 శాతంగా ఉండగా, ఇప్పుడు గణనీయంగా పెరిగింది. ప్రపంచ సగటు 38 శాతంతో పోలిస్తే ఇది అధికం. అయినప్పటికీ దేశంలోని 23 శాతం సంస్థలు పరిమిత విధానాలతోనే సరిపెడుతుండగా, 20 శాతం సంస్థల్లో అసలు ఎలాంటి ఏఐ పాలసీ లేకపోవడం గమనార్హం. రోజువారీ పనుల్లో ఏఐ భాగమైనప్పటికీ పాలన, కార్యాచరణ సంసిద్ధతలో ఇంకా వెనుకబాటుతనం కనిపిస్తోందని నివేదిక పేర్కొంది.



# పంజాబ్‌పై ఢిల్లీ ప్రతీకారం..

**ఐదో విజయంతో ప్లే ఆఫ్స్ రేసులోకి..!**

ధర్మశాల: పంతొమ్మిదో సీజన్‌లో పంజాబ్ కింగ్స్ పరాజయాల పరంపర కొనసాగుతోంది. ధర్మశాలలో రెండొందలు కొట్టిన పంజాబ్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ చిత్తుగా ఓడించింది. 211 పరుగుల ఛేదనలో టాపార్డర్ విఫలమైనా.. అక్షర్ పటేల్(56) కెప్టెన్ ఇన్నింగ్స్‌కు డేవిడ్ మిల్లర్(51)లు కంగారు పడలేదు. కాస్త కుదురుకున్నాక గేర్ మార్చిన ఇద్దరూ అర్ధ శతకాలతో మెరవగా.. ఇంప్యాక్ట్ సబ్ అశుతోష్ శర్మ(24), అకీబ్ నబీ(10 నాటౌట్) ఒత్తిడికి లోనవ్వకుండా లాంఛనం పూర్తి చేశారు. దాంతో, పంజాబ్‌కు వరుసగా నాలుగో ఓటమి ఎదురవ్వగా.. ఐదో విజయంతో ఢిల్లీ ప్లే ఆఫ్స్ రేసులోకి దూసుకొచ్చింది.

ప్లే ఆఫ్స్ రేసులో వెనకబడిన ఢిల్లీ క్యాపిటల్స్ అదిరే విజయంతో ముందంజ వేసింది. గత మ్యాచ్‌లో రికార్డు లక్ష్యాన్ని ఛేదించిన పంజాబ్ కింగ్స్‌ను ఓడించి ఆశలు సజీవంగా ఉంచుకుంది. సోమవారం ధర్మశాల వేదికగా జరిగిన మ్యాచ్‌లో అక్షర్ పటేల్(56), డేవిడ్ మిల్లర్(51) వీరబాదుడుతో పంజాబ్‌పై ప్రతీకార విక్టరీతో మురిసింది ఢిల్లీ.

ఛేదనలో ఢిల్లీకి ఆదిలోనే షాకిచ్చాడు యశ్ ఠాకూర్. అభిషేక్ పొరెల్(5)ను బౌల్డ్ చేయగా.. అర్ష్‌దీప్ ఓవర్లో ఫోర్ బాదిన కేఎల్ రాహుల్(9).. షార్ట్ బంతికి దొరికిపోయాడు. 14 పరుగులకే ఓపెనర్లు డగౌట్ చేరారు. ఓ సిక్సర్‌తో అలరించిన కుర్రాడు సహిల్ పరాక్ (0) సైతం అర్ష్‌దీప్ ఓవర్లో స్లిప్‌లో చాహల్‌కు క్యాచ్ ఇచ్చేశాడు. అనంతరం కెప్టెన్ అక్షర్ పటేల్(56), స్టబ్స్(12) దూకుడుగా ఆడారు. స్టొయినిస్ ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లు బాదిన అక్షర్ ఆఖరి బంతికి ఔటయ్యాడు.

అయినా.. డేవిడ్ మిల్లర్(51) బౌండరీలతో భయపెట్టాడు. ద్వారుషీ బౌలింగ్‌లో రెండు సిక్సర్లు బాదిన ఈ డాషింగ్ బ్యాటర్ ఆ తర్వాత వికెట్ కీపర్ చేతికి చిక్కాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా ఇంప్యాక్ట్ సబ్ అశుతోష్ శర్మ(24) పట్టువదల్లేదు. స్టొయినిస్ వేసిన 17వ ఓవర్లో అశుతోష్ 4, 6 .. మధవ్ తివారీ(18 నాటౌట్) సిక్సర్ బాదగా 19 రన్స్ వచ్చాయి. కానీ, తర్వాతి ఓవర్లో అశుతోష్ ఔటయ్యాడు. దాంతో.. ఉత్కంఠ నెలకొంది. కానీ, అకీబ్ నబీ(10 నాటౌట్) వస్తూనే ఫోర్, సిక్సర్‌తో ఢిల్లీకి మూడు వికెట్ల విజయాన్ని అందించాడు.

ప్రియాన్ష్, శ్రేయాస్ అర్ధశతకాలు

సొంత మైదానమైన ధర్మశాలలో తొలుత ఆడిన పంజాబ్ కింగ్స్ భారీ స్కోర్ కొట్టింది. ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య(56) విధ్వంసక ఆటతో రెచ్చిపోగా.. పవర్ ప్లేలో ఢిల్లీ బౌలర్లు నీరుగారిపోయారు. ప్రభ్‌సిమ్రన్ సింగ్(18)తో కలిసి దంచేశాడు. ముకేశ్ ఓవర్లో ప్రభ్‌సిమ్రన్ ఔటవ్వగా తొలి వికెట్‌కు 78 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. కూపర్ కొన్నొల్లీ(38) అండగా మిడిల్ ఓవర్లో శ్రేయాస్ అయ్యర్(59 నాటౌట్) దంచేశాడు. ఆఖర్లో మిచెల్ స్టార్క్(2-57) రెండు వికెట్లు తీసినా సూర్యాన్ష్ షెడ్గే(21 నాటౌట్) మెరుపులతో పంజాబ్ స్కోర్ రెండొందలు దాటింది. కానీ, చివరి ఓవర్లో ఎంగిడి ఏడు పరుగులే ఇవ్వగా పంజాబ్ 210కి పరిమితమైంది.

# స్కాట్లాండ్ జట్టులో ఇంగ్లండ్ స్టార్..

**అండర్-19 అమ్మాయిలకు తొలి అవకాశం..!**



**స్కాట్లాండ్:** మహిళల టీ20 ప్రపంచకప్ కోసం స్కాట్లాండ్ బోర్డు స్క్వాడ్‌ను ప్రకటించింది. రెండోసారి మెగా టోర్నీకి అర్హత సాధించిన స్కాట్లాండ్‌కు క్యాథరీన్ బ్రైసీ కెప్టెన్‌గా వ్యవహరించనుంది. సోమవారం సెలెక్టర్లు ఎంపిక చేసిన 15 మందితో కూడిన పటిష్టమైన బృందంలో తొమ్మిదేళ్లుగా జాతీయ జట్టుకు ఆడని కిర్‌స్టిన్ గోర్డన్‌కు చోటు దక్కింది. అండర్-19 టీ20 వరల్డ్‌కప్‌లో మెరిసిన పలువురికి మెగా టోర్నీకి తీసుకోవడం విశేషం.

ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ గ్లోబల్ క్వాలిఫయర్‌లో సూపర్ సిక్స్ చేరడం ద్వారా రెండోసారి టోర్నీకి అర్హత సాధించింది స్కాట్లాండ్. ఈ మెగా ఈవెంట్‌లో సత్తా చాటాలనే ఉద్దేశంతో సీనియర్లు, జూనియర్లకు ప్రాధాన్యమిచ్చారు సెలెక్టర్లు. ముఖ్యంగా 2018లో ఇంగ్లండ్‌కు ఆడిన కిర్‌స్టీ గోర్డన్ ఈసారి సొంతదేశం జెర్సీతో మెగా టోర్నీలో పాల్గొననుంది. 2017 తర్వాత కిర్‌స్టిన్ స్కాట్లాండ్‌కు ఆడడం ఇదే తొలిసారి. అలానే.. నిరుడు అండర్-19 టీ20 వరల్డ్‌కప్‌లో రాణించిన బౌలర్ గాబ్రియెల్లా ఫొంటెన్లా, వికెట్ కీపర్ బ్యాటర్ పిప్పా స్ప్రౌల్, అన్‌క్యాప్డ్ బౌలర్ మైసీ మసీరాలు తొలిసారి సీనియర్ టీమ్‌కు ఎంపికయ్యారు.

'ప్రపంచకప్ కోసం పదిహేను మందిని ఎంపిక చేయడం చాలా కష్టంగా అనిపించింది. చాలామంది ప్రతిభావంతులు ఉండడమే అందుకు కారణం. గతకొన్నేళ్లుగా స్కాట్లాండ్‌లో మహిళల క్రికెట్‌కు పెరుగుతున్న ఆదరణకు ఇది నిదర్శనం. మెగా టోర్నీ కోసం అన్ని విభాగాల్లో సమతూకంతో కూడిన బృందాన్ని ఎంపిక చేశాం. ఈ స్క్వాడ్ కచ్చితంగా ప్రపంచకప్‌లో విజయవంతం అవుతుదనే నమ్మకముంది. స్క్వాడ్‌లో కిర్‌స్టీ గోర్డన్ వంటి ప్రపంచస్థాయి క్రికెటర్లు ఉన్నారు.

గోర్డన్ రాకను మేము స్వాగతిస్తున్నాం. స్కాట్లాండ్ క్రికెట్ ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఆమె తోడ్పడుతుందనే నమ్మకముంది. ఆమెతో కలిసి పనిచేసేందుకు.. తన నైపుణ్యాలను మరింత సానబెట్టేందుకు ఎదురు చూస్తున్నా' అని వల్లసీ పేర్కొంది. ప్రపంచకప్ కంటే ముందు బంగ్లాదేశ్, నెదర్లాండ్స్ జట్లతో ముక్కోణపు సిరీస్ ఆడనుంది.

**స్కాట్లాండ్ వరల్డ్‌కప్ స్క్వాడ్ :** క్యాథరీన్ బ్రైసీ(కెప్టెన్), చోలె అబెల్, ఒలివియా బెల్, సారాయ్ బ్రైసీ, డార్సీ కార్టర్, ప్రియాంజ్ ఛటర్జీ, గాబ్రియెల్లా ఫొంటెన్లా, క్యాథరిన్ ఫ్రేజర్, కిర్‌స్టీ గోర్డన్, ఐల్సా లిస్టర్, మైసీ మసేరియా, అబతాహ మక్సూద్, మేగన్ మెక్‌కొల్ , రాచెల్ స్లేటర్, పిప్పా స్ప్రౌల్.

# గోండా చేరుకున్న వినేశ్ పోగట్..

**ఆమె వివరణ సరిపోలేదన్న డబ్ల్యూఎఫ్ఐ**



**అయోధ్య:** రెజ్లర్ వినేశ్ పోగట్ వివాదం ఇంకా రాజుకుంటోంది. జాతీయ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నీలో పాల్గొనేందుకు ఆమె ఇవాళ గోండా చేరుకున్నారు. అయితే టోర్నీలో పాల్గొనేందుకు ఆమెకు భారత రెజ్లింగ్ సమాఖ్య నుంచి అనుమతి దక్కలేదు. షో కాజు నోటీసుకు తగిన వివరణ ఇవ్వలేదని డబ్ల్యూఎఫ్ఐ పేర్కొన్నది. రిటైర్మెంట్ తర్వాత తాను మళ్లీ పోటీపడేందుకు అర్హురాలిని అని ఆమె చెప్పుకున్నది. అయితే స్వదేశీ ఈవెంట్లలో జూన్ 26వ తేదీ వరకు వినేశ్ పోగట్ పాల్గొనడానికి అర్హత లేదని డబ్ల్యూఎఫ్ఐ తన నోటీసులో పేర్కొన్న విషయం తెలిసిందే.

రిటైర్మెంట్ తీసుకున్న తర్వాత అథ్లెట్లు మళ్లీ పోటీల్లో పాల్గొనాలంటే ఆరు నెలల గ్యాప్ ఉండాల్సిందే. ఈ నియమం ప్రకారం ఆమె అర్హురాలు కాదు అని భారత రెజ్లింగ్ సమాఖ్య తన షోకాజులో పేర్కొన్నది. కానీ వినేశ్ మాత్రం అయోధ్య చేరుకున్నది. ప్రపంచ యాంటీ డోపింగ్ ఏజెన్సీలోని రూల్ 5.6.1 ప్రకారం యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్‌కు తన కమ్‌బ్యాక్ గురించి చెప్పినట్లు వినేశ్ వెల్లడించింది. గత జూన్‌లోనే ఈ విషయాన్ని చేరవేసినట్లు ఆమె చెప్పింది.

రిటైర్మెంట్ తర్వాత మళ్లీ పోటీపడాలని భావిస్తున్న అథ్లెట్లు యూడబ్ల్యూడబ్ల్యూ ప్రకారం టోర్నీకి ఆర్నెళ్ల ముందు వెల్లడించాల్సి ఉంటుంది. కానీ వినేశ్ ఇచ్చిన వివరణతో రెజ్లింగ్ సమాఖ్య సంతృప్తి చెందలేదు. కేవలం అర్హత గురించి మాత్రమే ఆమె వివరణ ఇచ్చిందని, కానీ క్రమశిక్షణా చర్యల గురించి ఆమె ఎటువంటి వివరణ ఇవ్వలేదని డబ్ల్యూఎఫ్ఐ తెలిపింది.

జాతీయ టోర్నీలో పాల్గొంటున్న మహిళా రెజర్లకు ఇవాళ సాయంత్రం 5 నుంచి 7 వరకు వెయిట్ చెకింగ్ చేయనున్నారు. మంగళవారం వాళ్లకు పోటీలు నిర్వహిస్తారు. ఈ టోర్నీలో గెలిచిన వాళ్లకు వరల్డ్ చాంపియన్‌షిప్ ట్రయల్స్‌లో పోటీపడే అవకాశం ఇస్తారు.

## ఐపీఎల్ ప్లేఆఫ్స్ రేసు
# 8 జట్ల మధ్య హోరాహోరీ..

**ముంబై ఇండియన్స్‌పై విజయంతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి ఆర్సీబీ**

**ప్లేఆఫ్స్ రేసు నుంచి ముంబై, లక్నో అధికారికంగా నిష్క్రమణ**

**14 పాయింట్లతో ఆర్సీబీ, ఎస్ఆర్‌హెచ్, గుజరాత్ మధ్య గట్టి పోటీ**

**పంజాబ్, చెన్నై, రాజస్థాన్ జట్లకు రాబోయే మ్యాచ్‌లు అత్యంత కీలకం**

**ఎనిమిది జట్లు ఇంకా ప్లేఆఫ్స్ బెర్తుల కోసం పోటీ పడుతున్న వైనం**

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026 సీజన్ ప్లేఆఫ్స్ రేసు ఊహించని మలుపులతో అత్యంత రసవత్తరంగా మారింది. ఓటమి అంచున నిలిచి, వరుసగా మూడో పరాజయం చవిచూస్తుందనుకున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), ముంబై ఇండియన్స్ (ఎంఐ)పై చివరి ఓవర్లో సాధించిన థ్రిల్లింగ్ విజయంతో సమీకరణాలను ఒక్కసారిగా మార్చేసింది. ఈ గెలుపుతో ఆర్సీబీ 14 పాయింట్లతో పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. అదే సమయంలో ఈ ఫలితంతో ముంబై ఇండియన్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్లు అధికారికంగా ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించాయి. ప్రస్తుతం నాలుగు బెర్తుల కోసం మొత్తం 8 జట్లు పోటీలో నిలవడం ఉత్కంఠను రెట్టింపు చేస్తోంది.



వివిధ జట్ల ప్లేఆఫ్స్ అవకాశాలు:

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ): రజత్ పాటిదార్ నేతృత్వంలోని ఆర్సీబీ 11 మ్యాచ్‌లలో 14 పాయింట్లు, ం1.103 నెట్ రన్ రేట్‌తో టాప్‌లో ఉంది. ప్లేఆఫ్స్ బెర్త్ ఖాయం చేసుకోవాలంటే వారికి మరో విజయం అవసరం. సాధారణంగా 16 పాయింట్లు ప్లేఆఫ్స్‌కు సరిపోతాయి. అయితే, మిగిలిన అన్ని మ్యాచ్‌లు గెలిచి టాప్-2లో నిలవాలని ఆర్సీబీ లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల ఫైనల్ చేరేందుకు రెండు అవకాశాలు లభించే క్వాలిఫయర్-1లో ఆడే ఛాన్స్ దక్కుతుంది.

సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్): ఎస్ఆర్‌హెచ్ కూడా 14 పాయింట్లతో ఆర్సీబీతో సమానంగా ఉన్నప్పటికీ, నెట్ రన్ రేట్ (ం0.737) కారణంగా రెండో స్థానంలో ఉంది. ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించాలంటే మిగిలిన మూడు మ్యాచ్‌లలో కనీసం రెండింటిలో గెలవాలి. మే 22న ఆర్సీబీతో జరిగే మ్యాచ్, క్వాలిఫయర్-1 స్థానాన్ని నిర్ణయించే అవకాశం ఉంది.

గుజరాత్ టైటాన్స్ (జీటీ): గుజరాత్ కూడా 14 పాయింట్లతో ఉన్నా, నెట్ రన్ రేట్ (ం0.228) తక్కువగా ఉండటం ప్రతికూలాంశం. ప్లేఆఫ్స్ బెర్త్‌ను పదిలం చేసుకోవాలంటే వారికి కూడా కనీసం రెండు విజయాలు అవసరం. మే 12న ఎస్ఆర్‌హెచ్‌తో జరగబోయే మ్యాచ్ వారికి కీలకం కానుంది.

పంజాబ్ కింగ్స్ (పీబీకేఎస్): మిగతా జట్లతో పోలిస్తే పంజాబ్ కింగ్స్ పరిస్థితి కాస్త మెరుగ్గా ఉంది. 10 మ్యాచ్‌లలోనే 13 పాయింట్లు సాధించింది. మిగిలిన నాలుగు మ్యాచ్‌లలో రెండు గెలిస్తే 17 పాయింట్లతో సునాయాసంగా ప్లేఆఫ్స్ చేరుకుంటుంది.


చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే): ఐదుసార్లు ఛాంపియన్ అయిన చెన్నై పరిస్థితి కొంచెం సంక్లిష్టంగా ఉంది. 16 పాయింట్ల మార్కును చేరాలంటే, మిగిలిన మూడు మ్యాచ్‌లలో కనీసం రెండింటిలో గెలవాలి. వారి నెట్ రన్ రేట్ (ం0.185) తక్కువగా ఉండటంతో, 16 పాయింట్లు సాధించినా ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సి రావచ్చు. అందుకే, మిగిలిన మూడు మ్యాచ్‌లూ గెలిస్తే నేరుగా ప్లేఆఫ్స్ చేరుకుంటుంది.

రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్): చెన్నైతో సమానంగా 12 పాయింట్లతో ఉన్న రాజస్థాన్ కూడా కనీసం రెండు విజయాలు లక్ష్యంగా పెట్టుకోవాలి. గత నాలుగు మ్యాచ్‌లలో మూడు ఓడిపోవడంతో వారి నెట్ రన్ రేట్ (ం0.082) మరింత పడిపోయింది. నాలుగో స్థానం కోసం చెన్నైతో రాజస్థాన్ తీవ్రంగా పోటీపడే అవకాశం ఉంది.

MOVIE TIME

## విశ్వంభర మూవీపై భారీ అంచనాలు

### రెండు పార్టులుగా విడుదల అంటూ పుకార్లు



**టాకీస్:** మెగాస్టార్ చిరంజీవి హీరోగా దర్శకుడు వశిష్ట తెరకెక్కిస్తున్న భారీ సోషియో ఫాంటసీ చిత్రం విశ్వంభరపై మరోసారి సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చ మొదలైంది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయనున్నారనే వార్తలు ఇటీవల వైరల్‌గా మారాయి. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ సినిమాలో త్రిష కథానాయికగా నటిస్తోంది. చాలా కాలం క్రితమే విడుదల కావాల్సిన ఈ సినిమా, పలు కారణాలతో వరుసగా వాయిదా పడుతూ వస్తోంది. ముఖ్యంగా ప్రస్తుతం టాలీవుడ్‌లో సీక్వెల్స్ ట్రెండ్ బలంగా కొనసాగుతున్న నేపథ్యంలో, 'విశ్వంభర'ను కూడా రెండు భాగాలుగా తీసుకురావాలని మేకర్స్ ఆలోచిస్తున్నారనే ప్రచారం జోరందుకుంది. అయితే ఈ వార్తలపై దర్శకుడు వశిష్ట తాజాగా స్పందిస్తూ క్లారిటీ ఇచ్చారు. 'రెండు పార్ట్స్‌గా వస్తున్న విశ్వంభర' అంటూ సోషల్ మీడియాలో వచ్చిన ఓ పోస్టుకు స్పందించిన ఆయన.. 'అవునా.. నిజమా?' అంటూ వెటకారంగా రిప్లై ఇచ్చారు. దీంతో ప్రస్తుతం ఈ సినిమా రెండు భాగాలుగా విడుదలయ్యే ఆలోచన లేదనే విషయం స్పష్టమైంది. ఇక సినిమా షూటింగ్ దాదాపు పూర్తయినప్పటికీ, విడుదల మాత్రం ఇంకా ఆలస్యమవుతోంది.

## 'లెనిన్'లో స్పెషల్ ఎపిసోడ్..

### అఖిల్ సినిమా కోసం దర్శకుడి భారీ ప్లాన్!




**టాకీస్:** అక్కినేని యువ హీరో అఖిల్ అక్కినేని ప్రస్తుతం తన కెరీర్‌లో ఎంతో కీలకంగా భావిస్తున్న 'లెనిన్' సినిమాతో బిజీగా ఉన్నాడు. దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరి తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే ఇండస్ట్రీ వర్గాల్లో మంచి బజ్‌ను క్రియేట్ చేస్తోంది. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో పీరియాడిక్ యాక్షన్ ఎమోషనల్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మరో ఆసక్తికర విషయం ఇప్పుడు టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. సమాచారం ప్రకారం.. 'లెనిన్' సెకండ్ హాఫ్‌లో ఓ ప్రత్యేకమైన ఎపిసోడ్ ఉండబోతుందట. ఈ ఎపిసోడ్ కోసం దర్శకుడు ప్రత్యేకంగా ఓ పవర్‌ఫుల్ పాత్రను డిజైన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే గత షెడ్యూల్‌లో ఈ సన్నివేశాలకు సంబంధించిన కొన్ని కీలక సీన్స్ కూడా చిత్రీకరించినట్లు సమాచారం.

అయితే ఆ స్పెషల్ రోల్‌లో ఎవరు నటిస్తున్నారు అన్నది మాత్రం ఇంకా సస్పెన్స్‌గా ఉంచారు. ఈ పాత్రకు ఓ ప్రముఖ నటుడిని తీసుకున్నారనే టాక్ వినిపిస్తుండగా.. మూవీ టీమ్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ స్పెషల్ క్యారెక్టర్ కథలో కీలక మలుపు తీసుకురానుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక ఈ సినిమా చిత్తూరు ప్రాంతం నేపథ్యంలో తెరకెక్కుతుండటం మరో విశేషం.



## ప్రేమ ఎప్పటికీ శక్తివంతమైనదే

### నటి త్రిష ఆసక్తికర పోస్ట్

టాకీస్: ఫిల్మ్ స్టార్ త్రిష తన సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. ప్రేమ ఎప్పటికీ శక్తివంతమైందే అని ఆమె తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. త్రిష తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని ఫోటోలు పెట్టారు. నీలిరంగు చీరలో త్రిష ఆకట్టుకున్నది. తమిళనాడు సీఎంగా ఆదివారం విజయ్ ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఆ ఈవెంట్‌కు ఈసారీలోనే ఆమె హాజరయ్యారు. ఆ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన త్రిష సోమవారం తన సోషల్ మీడియా పోస్టుతో తన భావోద్వేగాన్ని మరింత స్పష్టంగా వ్యక్తం చేశారు. చెన్నై నెప్రూ స్టేడియంలో సందడి చేసిన నటి త్రిష.. తన పోస్టులో ప్రేమ గొప్పతనాన్ని వ్యక్తం చేశారు. రకరకాల స్టిల్స్‌తో దిగిన



ఫోటోలను పోస్టు చేసిన త్రిష.. ప్రేమ ఎప్పటికీ గట్టిగానే వ్యక్తం అవుతుందన్న అభిప్రాయాన్ని ఆ పోస్టులో రాశారు. ద లవ్ ఈజ్ ఆల్వేస్ లౌడర్ అన్న క్యాషన్ ఇప్పుడు ట్రెండ్ అవుతోంది. ఆ పోస్టులో తన స్టయిలిస్ట్ బృందానికి ఆమె థ్యాంక్స్ కూడా చెప్పింది.

## వారణాసికి బయలుదేరుదాం

### హీరోయిన్ ప్రియాంక ఆసక్తికర పోస్ట్

**టాకీస్:** ఎస్ఎస్ రాజమౌళి -మహేశ్ బాబు కాంబోలో రాబోతున్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ వారణాసి. బాలీవుడ్ భామ ప్రియాంకా చోప్రా ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తుండగా.. మాలీవుడ్ స్టార్ యాక్టర్ పృథ్వీరాజ్ సుకుమార్ కీ రోల్‌లో నటిస్తున్నాడు. మైథాలజీ, సైన్స్ ఫిక్షన్ జోనర్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ చిత్రానికి సంబంధించి ఏదో ఒక ఆసక్తికర అప్‌డేట్ నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించిన కీ అప్‌డేట్‌ను ప్రియాంకా చోప్రా సోషల్ మీడియా ద్వారా షేర్ చేసుకుంది. జర్నీలో ఉన్న ప్రియాంకా చోప్రా 'వారణాసి బయలుదేరుదాం'అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టింది. తాజా పోస్ట్‌తో ప్రియాంకా చోప్రా వారణాసి తాజా షెడ్యూల్‌లో జాయిన్ అయినట్టు అర్థమవుతోంది. షూటింగ్‌కు అవసరమైన నీటి కొరత కారణంగా ఇటీవలే వారణాసి చిత్రీకరణ నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రియాంకా చోప్రా పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. శ్రీ దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ సంయుక్తంగా తెరకెక్కిస్తున్న ఈ మూవీలో మాధవన్, ప్రకాశ్ రాజ్ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం రెండు పార్టులుగా రాబోతుంది. ఈ మూవీని 2027 లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నట్టు వార్తలు వస్తుండగా జక్కన్న టీం నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.



## 2027 డిసెంబర్‌కు కల్కి-2 విడుదలకు ప్లాన్

**టాకీస్:** పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, వైవిధ్యభరిత దర్శకుడు నాగ్ అశ్విన్ కలయికలో వచ్చిన కల్కి 2898 ఎడి భారతీయ సినిమా స్థాయిని ప్రపంచవ్యాప్తంగా మరోస్థాయికి తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. వెయ్యి కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ విజువల్ వండర్ ఇప్పుడు రెండో భాగంతో మరింత భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానుందనే వార్తలు అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచుతున్నాయి.మొదటి భాగం ముగింపులో వచ్చిన ట్విస్టులు, ప్రభాస్ పాత్రకు సంబంధించిన ఎలివేషన్స్, కమల్ హాసన్ ఎంట్రీ ప్రేక్షకుల్లో భారీ ఉత్కంఠను రేకెత్తించాయి. దీంతో ఇప్పుడు అందరి దృష్టి 'కల్కి 2'పైనే ఉంది.తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రాన్ని 2027 డిసెంబర్ నాటికి విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. భారీ స్థాయిలో ఉండే విజువల్ ఎఫెక్ట్స్, సీజీఐ పనుల కోసం ఎక్కువ సమయం అవసరమవుతుండటంతో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని చిత్ర బృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. హాలీవుడ్ స్థాయి విజువల్స్‌తో భారతీయ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి ఇవ్వాలనే లక్ష్యంతో దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ ప్రాజెక్ట్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. ఇప్పటికే మొదటి భాగం చిత్రీకరణ సమయంలోనే సీక్వెల్‌కు సంబంధించిన సుమారు 30 శాతం షూటింగ్ పూర్తయినట్లు సమాచారం. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్స్‌లో అమితాబ్ బచ్చన్,కమల్ హాసన్ లపై కీలక సన్నివేశాలను




చిత్రీకరిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ప్రభాస్ ప్రస్తుతం 'స్పిరిట్', 'ఫౌజీ' వంటి భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నప్పటికీ, వచ్చే ఏడాది ప్రారంభంలో 'కల్కి 2' కీలక షెడ్యూల్స్‌లో పాల్గొనే అవకాశం ఉందని సమాచారం. మేకర్స్ ప్రణాళిక ప్రకారం 2027 ఏప్రిల్ నాటికి మొత్తం షూటింగ్ పూర్తి చేసి, ఆ తర్వాతి నెలలను పూర్తిగా పోస్ట్ ప్రొడక్షన్ పనులకే కేటాయించనున్నట్లు టాక్ వినిపిస్తోంది.ఈ సీక్వెల్‌లో ప్రభాస్ పోషిస్తున్న భైరవ, కర్ణ పాత్రలకు మరింత ప్రాధాన్యం ఉండనుందని తెలుస్తోంది. ముఖ్యంగా ప్రభాస్, కమల్ హాసన్ మధ్య జరిగే పవర్‌ఫుల్ పోరాట సన్నివేశాలు సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలుస్తాయని సినీ వర్గాలు చెబుతున్నాయి.

## ముంబైలో గ్రాండ్‌గా 'పెద్ది' ట్రైలర్ లాంచ్..

### పాన్ ఇండియా మార్కెట్‌పై భారీ ఫోకస్!

**టాకీస్:** టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్న పెద్ది సినిమా ఇప్పుడు మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికే పోస్టర్లు, గ్లింప్స్‌తో భారీ హైప్ తెచ్చుకున్న ఈ చిత్రం ట్రైలర్‌ను ముంబైలో గ్రాండ్ ఈవెంట్ ద్వారా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేసారు.మే 18న ముంబైలో జరగబోయే ఈవెంట్ ద్వారా ట్రైలర్ విడుదల చేస్తున్నట్టు అఫీషియల్ పోస్టర్ ద్వారా తెలియజేశారు. తెలుగు రాష్ట్రాలతో పాటు హిందీ మార్కెట్‌పై కూడా భారీ స్థాయిలో ఫోకస్ పెట్టిన చిత్ర బృందం, ట్రైలర్ లాంచ్‌ను బాలీవుడ్ మీడియా సమక్షంలో నిర్వహించేందుకు సిద్ధమవడం చర్చనీయాంశం అయింది. ప్రస్తుతం పాన్ ఇండియా సినిమాలకు ముంబై ప్రధాన ప్రమోషనల్ హబ్‌గా మారిన నేపథ్యంలో 'పెద్ది' టీమ్ కూడా అదే స్ట్రాటజీని ఫాలో అవుతోందని తెలుస్తోంది. ఈ ట్రైలర్ ఈవెంట్‌కు చిత్ర యూనిట్‌తో పాటు పలువురు బాలీవుడ్ ప్రముఖులు కూడా హాజరయ్యే అవకాశాలు ఉన్నాయని టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా హిందీ బెల్ట్‌లో సినిమాపై బజ్ పెంచేందుకు ప్రత్యేకంగా మీడియా ఇంటరాక్షన్స్, ఫ్యాన్స్ ఈవెంట్స్ కూడా ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. సినిమాలో హీరో పాత్రను ఇప్పటివరకు ఎప్పుడూ చూడని మాస్ అవతార్‌లో చూపించబోతున్నారనే ప్రచారం ఇప్పటికే అభిమానుల్లో ఆసక్తి పెంచింది. గ్రామీణ నేపథ్యంతో పాటు భారీ యాక్షన్ ఎలిమెంట్స్, భావోద్వేగ కథాంశం ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలుస్తాయని సినీ వర్గాలు చెబుతున్నాయి.




Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.